శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

కాకినాడ

సంపుటము ౪౦. సంచిక ౧-3

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక

కాకినాడ

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

చందా సంవత్సరమునకు మూఁడు రూపాయిలు.

సంపుటము ౪౦. { ఖర. చైత్ర-భాద్రపదములు. } సంచిక ౧-౩.

విషయసూచిక.

సంపాదకీయము.

ఆంధ్ర సాహిత్య పరిషత్తున కీసంవత్సరమునకు నలువదియేండ్లు నిండినవి. ఈ మహాకాలములో నెన్ని యంతరాయములు కల్గినను పరమేశ్వరానుగ్రహమువలన నిలువఁదొక్కుకొనఁ గల్గెను. ఈ నలువది వత్సరములనుండి కొనసాగించుచున్న నిరంతర భాషాసేవచేఁ బూర్వకవికృతములగు నపూర్వగ్రంథముల నలువదికిఁ బైఁగా ముద్రింపఁగల్గెను. ఈ సందర్భమునఁ బరిషత్తు శ్రీ శ్రీ శ్రీ పిఠాపుర మహారాజులుం గారికిఁ దన కృతజ్ఞతఁ దెలుపుకొనవలసి యున్నది.

శ్రీ శ్రీ శ్రీ పిఠాపుర మహారాజులుంగారీ పరిషత్తునకు ప్రతిష్ఠాపకులు. శ్రీ వెంకటగిరి జమీందారుగారు, శ్రీ బొబ్బిలి జమీందారు గార్లతోపాటు తామును బరిషత్తునకుఁ బదివేల రూపాయల నొసంగుటయేగాక పరిష దాశయములలోఁ బ్రధానమైన నిఘంటు నిర్మాణమునకు నిప్పటికి లక్ష రూపాయలకు పైఁగా వెచ్చించిరి. వారి యౌదార్యమువలన సూర్యరాయాంధ్ర నిఘంటువు నందిప్పటికి నాల్గుభాగములు ముద్రితములైనవి. ఐదవభాగము ముద్రణమగుచున్నది. మిగిలిన భాగములుకూడ నచిరకాలముననే ముద్రితములు కాఁగలవు

పరిషత్తు పుస్తక భాండాగారమున నింకను తాళపత్ర గ్రంథములలో నముద్రిత గ్రంథము లెన్నియేని గలవు. అందుండి యేఁబది గ్రంథములకుఁ బైఁగా పరిశోధించి వ్రాయఁబడి ముద్రణమునకు సిద్ధముగా నున్నవి. క్రమక్రమముగా నివి యీ పత్రికాముఖమున వెలువడఁగలవు.

పరిషత్కార్య నిర్వహణమున నింతవఱకు నెట్టిలోపము గలుగకుండ నుదార హృదయులగు జమీందారులును, ధనాధిపతులును, భాషాభిమానులును కావలసిన ధన సాహాయ్యము గావించుచుండిరి.

తెలుగువద్ద దానిని శ్రీ జయంతి రామయ్యపంతులుగారు రెండవ కంటికిఁ దెలియకుండఁ దామే భరించుచు వచ్చిరి. ఈ మధ్యకాలములో దేశమునందలి స్థితిగతులు కలుషితమైనవి. పరిషదార్థిక స్థితిగూడ కలుషితమైనది.

ఇది యిట్లుండఁగా 1946 సంవత్సరమున శ్రీ ప్రభల వెంకట సుబ్బమ్మగారి యౌదార్యముచే నీ పరిషత్తునకొక భవననిర్మాణము జరిగెను. ఈ నిర్మాణ సందర్భమున శ్రీ వెంకట సుబ్బమ్మగారొసంగిన భూరి విరాళముగాక దాదాపు ఎనిమిదివేల రూప్యములు అప్పు చేయవలసి వచ్చినది. అందుచేఁ బరిషత్తునకు వచ్చు నాదాయము చాలక 1946 సంవత్సరమునుండి నేఁటివఱకును బరిషద్వ్యవహారములు జరుగవలసినంత చక్కగా జరుగుటలేదు. పరిషత్ పత్రికయు సంవత్సరమున నాలుసంచికలు రావలసినది రెండు సంచికలతోనే ముగింపవలసి వచ్చుచున్నది. ఈ ఖరసంవత్సరమునకుఁ గూడ నిట్లే రెండు సంచికలు మాత్రమే వెలువడఁగలవు. రాఁబోవు నందన సంవత్సరమునుండి యథావిధిగా మూడునెలల కొకసారి పత్రికను బంపఁగలమని మా చందాదారులకు విన్నవించుట కెంతయు సంతసించుచున్నాము.

పరిషత్తునకు నేఁడున్నయప్పులు తీర్చి మరలఁ బూర్వరీతిని బరిషత్ప్రచారము గావించి భాషాసేవ చేయుటకు ఈ సంవత్సరారంభమునఁ గ్రొత్తగా పరిషత్కార్య నిర్వాహకవర్గ మెన్నుకోఁబడెను. భవనసంపాదనమునకై సంగీత నృత్యసభలను నాటక ప్రదర్శనములను గావించుటకును, చందాదారులను యావజ్జీవ సభ్యులను, పోషకులను జేర్చుటకును తీవ్ర ప్రయత్నములను జేయవలసినట్లుగా తీర్మానము జరిగెను.

ప్రప్రథమమున కాకినాడ నగరమునందే 2—2—1952 తేది పరిషత్తు ప్రథమ వార్షికోత్సవమునకై యొక సంగీత నృత్యసభ జరుపఁబడెను. ఇందు శ్రీమతి వక్కలంక సరళాదేవిగారు పరిషత్తునందు తమకుఁ గల యాదరాభిమానములచే మా యాహ్వానము నంగీకరించి వచ్చి తమ మృదుమధురగానమహిమచే సహృదయ సామాజిక హృదయముల నానందాబ్ధి నోలలాడించిరి. అట్లే శ్రీ కుమారి సూర్యకళ శాస్త్రియను భరతనాట్య ప్రదర్శనము గావించి సామాజికుల యపారామోదమునకుఁ బాత్రురాలయ్యెను. ఇంకను మహోదార చిత్తులగు నటుల గాయకుల నర్థించి వారి సాయమునఁ బరిషత్తునకుఁ గల యప్పుదీర్చి పూర్వౌన్నత్యమును నెలకొల్పుటకుఁ బ్రయత్నములు సాగుచున్నవి.

నేఁడు ప్రభుత్వము ప్రజాధీనమైనది. అచిరకాలమునందే ప్రత్యేక రాష్ట్రము కూడ లభింపఁగలదని యాంధ్ర మహాశయులెల్లరు నువ్విళ్ళూరుచున్నారు. దైవానుగ్రహమువలన ప్రత్యేకరాష్ట్రమే మనకు ప్రాప్తించిన నాఁడు రాష్ట్రముతోపాటు రాష్ట్రమునకు జీవగఱ్ఱయగు భాషకుఁగూడ ప్రత్యేకత సిద్ధింపఁగలదు. ఆ ప్రత్యేకతను—తెలుఁగు తేటఁదనమును, తియ్యఁదనమును—సాధించుకోవలసిన భారమాంధ్ర భాషావిదులపైనున్నది. ఆంధ్రభాషా కోవిదులును, భాషాభిమానులు నగు వారు దానికై నేటినుండియుఁ బ్రయత్నములు సలుపవలసి యున్నది. ఎంత ప్రతిభాశాలియగు కవియైనను, ఎంత వ్యుత్పన్నుఁడగు పండితుఁడైనను దనకుఁదానొంటరిగా నేకార్యము దలపెట్టినను కొనసాగుట కష్టము "సంఘేశక్తిః కలౌయుగే" యన్నట్లు సంఘీభావముతో నెంతటి కార్యమైనను సుకరముగా సాధింపవచ్చును. కావున నాంధ్ర భాషావిదులును, భాషాభిమానులు నగు మహాశయు లందఱును చిరకాలమునుండి మాన భాషాభ్యున్నతికై కృషిచేయుచున్న మా పరిషత్తుతోఁ గలిసి యేకముఖముగా నాంధ్ర భాషాసేవ గావింపఁ బ్రార్థించుచున్నాము.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

—:o:—

శ్రీ పిఠాపురం మహారాజావారి ధనసాహాయ్యముచే రచియింపఁబడుచున్న పెద్దనిఘంటువు. నాలుగుసంపుటములు ముద్రితమై విక్రయమునకు సిద్ధముగానున్నవి. ఇందు, అకారము మొదలు నకారము వఱకునుగల సంస్కృతాంధ్రశబ్దము లన్నియుఁ గలవు. ఈ నిఘంటువునందు సంస్కృతశబ్దములు పూర్వనిఘంటువు లన్నిటియందుకంటె మిక్కిలి యధికముగా నీయఁబడినవి. కావున సంస్కృతవిద్యార్థులకు గూడ మిక్కిలి యుపయోగకరముగా నుండును. ఇది యున్నచో సంస్కృతనిఘంటువుల యపేక్షయుండదు. ఆచ్ఛికపదములకుఁగల యర్థభేదములఁ గనఁబఱిచి వానికిఁ బ్రమాణవాక్యములు పూర్వగ్రంథముల నుండి విపులముగా నీయఁబడినవి. లభ్యమైనంతవఱకుఁ దేశ్యశబ్దములకు సంస్కృత ప్రాకృత ద్రావిడాది భాషలయందుఁగల సజాతీయపదములు చూపఁబడినవి. కేవలము విడిశబ్దములేగాక సందర్భానుసారముగ సమస్తపదములు (Phrases) ను వానికిఁగల యర్థములును బ్రయోగములునుగూడ నీయఁబడినవి. జనకశబ్దములక్రింద జన్యశబ్దములు చూపఁబడినవి. ఈ పుస్తకమును రచించుటకు, ముద్రించుటకు విశేషద్రవ్యము పట్టినను ధనవంతులకేగాక జనసామాన్యమునకుఁ గూడ లభ్యముగా నుండవలయునను తలంపుతోఁ దక్కువవెల నిర్ణయింపఁబడినది.

మొదటిసంపుటము	రు. 5-0-0
మిగిలినవి సంపుటమునకు	4-0-0

భాద్రపదము

శ్రీ బులుసు వేంకటేశ్వరులు బి. ఏ.

స్వార్థపరతా పిశాచ పీడావృతంబు
తుచ్ఛవాంఛోపహతము సత్తుంగధర్మ
పథవివర్జితము జగంబు పరిణతిఁగన
భద్రము లొసంగుఁగావుత! భాద్రపదము. ౧

శుద్ధజీవిత కాసార శోషణంబు
జీవ జీవన వితతిచే సిగ్గుపఱచి
నిండుదనము నొసంగి యున్నిద్రసుఖముఁ
దగ నొసంగుత! భాద్రపదంబు కృపను. ౨

సింహానాదార్భటిం బోలు చెలువు చూపి
జగము గ్రింగంగఁ బొంగు నిమ్నగల కొసఁగు
వర్షపీయూష జలమున భాద్రపదము
భద్రములొసంగుఁ గావుత! భరతజగతి. ౩

క్షణమునను వాన యామఱుక్షణమునందు
నెండ క్షణమున రెండును నుండనొకట
భరతతత్త్వముఁ దెలిపెడి భాద్రపదము
భద్రము లొసంగుఁ గావుత! పరమకృపను. ౪

గ్రీష్మతాపంబు హేమంతఋతువు చలియు
రెండిటికి దూరమై సుఖం బొందొసంగి
భారతర్షుల మెడఁదకోపమునుబోలు
భాద్రపదమొసంగుత! జగద్భద్రముఁ గృప. ౫

— మార్గదేశికవితలు —

శ్రీ బండారు తమ్మయ్య

భారతదేశమున మార్గదేశివిభేదము సంగీతసాహిత్య నృత్యాది కళలయందుఁ జిరకాలమునుండి నెలకొనినట్లు కాననగును. సంగీతము నందు నృత్యమునందుఁగల దేశి విధాన స్వరూపము కొంతవఱకు సంగీత రత్నాకరము, భరతుని నాట్యశాస్త్రము మున్నగు తచ్ఛాస్త్రగ్రంథ ములందు నిర్వచింపఁబడియున్నది. శ్రీనాథుఁడు కాశీఖండములో అగ స్త్యుని దక్షారామక్షేత్ర సందర్శన సందర్భమునఁ జెప్పిన

"మునిచూడామణి యెల్ల సత్కళలకున్ మూర్ధాభిషిక్తుండుగా
వున జారీకరణాంగహారముల తా వుల్మెచ్చి కీర్తించుచున్
శనివారోత్సవమాచరించి కనెనా స్థానంబునన్ రాజనం
దనయుం డానును దేశిమార్గముల గంధర్వాప్సరోనృత్తముల్."

అనుపద్యమువలనఁగూడ నృత్యకళయందలి దేశిమార్గ విభేదము చాలఁ బ్రాచీనకాలమునుండియు నున్నట్లు స్పష్టమగును. కాని సాహిత్యము (కవిత్వము) నకు సంబంధించిన మార్గదేశివిభేదమిదమిత్థమని మనలక్షణ గ్రంథములందు విశదముగ వివరింపఁబడినట్లు కానరాదు. ఆంధ్రవాఙ్మ యమున నింతవఱకుపలబ్ధములయిన గ్రంథములలో మొదటి కావ్యమని పలువురు పండితులు తలంచెడి నన్నయభట్టారకుని యాంధ్రమహాభార తము నవతారికలో నాతఁడు మార్గదేశి కవితల గొడవతడవియుండలేదు కాని నన్నయ భారతముకన్నఁ బ్రాచీనమని కొందఱు సమకాలీనమని కొందఱు అర్వాచీనమని మఱికొందఱుతలంచెడి నన్నెచోడునికుమార సంభవములో నా కవివరుఁడు మార్గదేశికవితల ప్రసంశనీక్రిందిపద్యమున గొంతకావించియున్నాఁడు.

"మును మార్గకవిత దేశం । బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గునిలిపిరంధ్రవిషయమున । జనసత్యాశ్రయునిదొట్టి చాళుక్యనృపుల్.
(తెనుంగును నిలిపిరంధ్రవిషయం బున జనఁజాళుక్యరాజు మొదలుగఁ
బలువుర్" అని పాఠాంతరము)

ఈపద్యమునకు ముందాతఁడు వరుసగా శివుఁడు, విష్ణువు, బ్రహ్మ రవి, గణపతి, షణ్ముఖుఁడు, మన్మథుఁడు, పార్వతి, భారతియను దేవతల స్తుతించి యటుతరువాతఁ దనగురువు, కృతిపతియునగు జంగమమల్లి కార్జునయోగిని సన్నుతించి, "వ" అని యిష్టదేవతా నమస్కారమ్ము చేసినమస్తదేవతా స్వరూపంబయిన మదీయ గురుచరణారవిందంబు లభినుతించి" అనివ్రాసి యావెనువెంటనే సంస్కృతకవిస్తుతి నుపక్రమించి యా గీర్వాణకవులలోఁ గ్రమంబుగ వాల్మీకి, వ్యాసుఁడు, కాళిదాసు, భారవి, ఉద్భటుఁడు, బాణుఁడు అను వారిని మాత్రము స్తుతించియు న్నాఁడు. అటు తరువాతనే పైనిజెప్పిన "మునుకవిత......" అను పద్యమును వ్రాసిదానివెనుక

"సురవరులం గ్రమంబున నచోమణి సంహతిఁబూజచేసి, మ
ద్గురు చరణారవిందములకుం దగ సన్నుతిఁజేసికొల్చి, వి
స్తరమతులం బురాణకవి సంఘము నుత్తమమార్గసత్కవీ
శ్వరులను దేశిసత్కవుల సంస్తుతిచేసి మనోముదంబునన్."

అను పద్యమునువ్రాసియున్నాఁడు. పర్యాలోచించిచూచిన నీపద్యము నన్నెచోడుఁడంతకు ముందుగావించినవర్ణన క్రమమునకు (దేవతాస్తుతి, గురుస్తుతి, గీర్వాణకవిస్తుతి, మార్గదేశికవిప్రశంస) అనుగుణముగానే రచింపఁబడినదని విస్పష్టముగ గోచరించును. "మునుమార్గకవిత..."అను పద్యములో నాతఁడు మార్గదేశికవి ప్రశంసను సాముదాయికముగఁ గావించెనేగాని యాముందుగాని వెనుకఁగాని గీర్వాణకవులవలె మార్గ కవులఁగాని దేశికవులఁగాని యెవరిని నామతః పేర్కొనిస్తుతించియుండ లేదు. కుమారసంభవమును 1909 సంవత్సరములో మొదటఁ బ్రకటిం చిన శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు పైనిబేర్కొనిన "మునుమార్గ

కవిత..." అను 23 పద్యమునకు అధోజ్ఞాపికలో "మార్గకవిత=సంస్కృత కవిత; దేశికవిత=భాషాకవిత్వము, ద్రవిడాంధ్రకర్ణాటాదికవిత" అనివివరించినారు. కవిగారు గావించిన యీ వివరణము నన్నెచోడమతానుసరణముగాఁ గాన్పింపదని నాయభిప్రాయము. మార్గకవితయనఁగేవల సంస్కృత కవితయేనా? ఆంధ్ర దేశమునఁ జాళుక్యరాజులపాలనమునకుఁ బూర్వము కేవలము సంస్కృతభాషలోనేగాని దేశభాషయగు నాంధ్రములో నెట్టికృతులును రచింపఁబడనేలేదా యనువిషయము విచారణీయము. నన్నియ నన్నిచోడుల కాలములకుఁ బూర్వము వారి భారత కుమార సంభవములవలె గ్రంథరూపముదాల్చిన యాంధ్రవాఙ్మయము మనకిప్పుడు లభ్యముగాకున్నను గీర్వాణచ్ఛందములగు వృత్తములందును అక్కర, రగడ, సీసము మున్నగు దేశీయచ్ఛందములలోను దెలుఁగు భాషలో రచింపఁబడిన పద్యములుగల ప్రాచీన శాసనములు కొన్ని లభ్యమగుటచే నవి నన్నయాదులకుఁబూర్వమాంధ్రభాషలో నెట్టి రూపమునను గూడ బద్యరచనమే జరుగలేదను నూహలకు వ్యతిరేకసాక్ష్యమొసంగుచున్నవి. "సురవరులంగ్రమంబుగ......" అను నన్నెచోడుని పద్యమందలి "విస్తరమార్గులన్" అనువిశేషణము తరువాతనున్న పురాణకవిసంఘము, ఉత్తమమార్గసత్కవీశ్వరులు, దేశిసత్కవులు, మూఁటికిఁగూడ సాముదాయకముగ నన్వయించును. "పురాణకవిసంఘము" అనుటలో నన్నెచోడుఁడుద్దేశించినది యాతఁడు నన్నుతించిన గీర్వాణకవులార్వురనుగూడ ననియే యెన్నఁదగును. అట్లుగాక వ్యాసవాల్మీకులిరువురమాత్రమే పురాణకవిశబ్దవాచ్యులుగను, కాళిదాసాదులు నల్వురను మార్గసత్కవీశ్వరులుగను నాతఁడు సంభావించెనని తలంచుట సమంజసము కాదనియే నాయభిప్రాయము. కేవలసంస్కృత కవితనే మార్గకవితగను, తద్భాషాకవులనే మార్గకవులుగను, నాతఁడుగణించియున్నచోఁ జాళుక్యరాజులకుఁబూర్వము కొన్నివందల సంవత్సరముల నుండి భరతఖండము నల్గడల గీర్వాణభాషాకావ్యములు రచింపఁబడి

యుండ నాంధ్రదేశవిషయమున వాతేఁడు ప్రత్యేకముగా "మునుమార్గ కవిత......" అను పద్యమును వ్రాయుటలో స్వారస్యమంతేగాఁ గానరాదు. భూపాలురు తమ శాసనములను దఱచుగాఁ గేవల సంస్కృత వృత్తములతోను బ్రకటించుపద్ధతి దేశమునఁ బరిపాటిగానుండ దేశీయ చ్ఛందములలో రచింపఁబడిన పద్దియములకుఁగూడ నాదరణము చూపు నుద్దేశముతోఁ జాళుక్యనృపులుకొందఱు తమశాసనములందు వానికిఁ గూడ స్థానమొసంగుచు దేశికవితా పోషణమునెడఁ బ్రకటించిన యభిలాషమును బ్రశంసించునుద్దేశముతోడనే ముఖ్యముగా నన్నెచోడుఁడీ పద్యమును వ్రాసియుండును. దేశీయచ్ఛందమగు అక్కరలోనేపూర్తిగా లిఖింపఁబడిన యుద్ధమల్లుని బెజవాడ శాసనమువంటి వాతేనికాలమునకు మున్నే వెలసియున్నవి. మార్గదేశి కవితావిభేదవిషయమున నన్నెచోడునిదృష్టిలోఁగేవల సంస్కృతభాషాకావ్యములకుఁ బ్రసక్తిలేదనియే నా తలంపు.

సంస్కృతము భరతఖండమందంతట జనుల వాడుకభాషగా (spoken language) నుండిన యత్యంత ప్రాక్తనకాలమును మనము గుర్తింపఁజాలము. అవలట్టికాలమెప్పుడయిన నుండెనాయనుటగూడ సంశయాస్పదమే. ఆయా దేశభాష లాయా దేశజనులవాడుక భాషలుగా వెలసియున్నను నన్ని దేశములందునుగూడఁ గొలఁదిగనో గొప్పగనో చిరకాలమునుండి యిప్పటికిఁగూడఁ గొందఱు పండితులచే గీర్వాణభాషా కావ్యములు ప్రత్యేకముగ రచింపఁబడుచునేయున్నవి. దేశభాషలుజనుల వాడుకభాషలుగా వ్యవహృతములగుచున్న కాలములో గీర్వాణ భాషా కవిత కొంతసాగి రాజాదరణము నొందినంతమాత్రమున జనులు తమ దేశభాషలో నెట్టి కృతులను నసలేరచింపకుందురనుట ప్రకృతి స్వభావ విరుద్ధమని చెప్పనక్కఱలేదు. కావున నన్నయ యుగమునకుఁ బూర్వమందుండిన దేశికవితలఁగూర్చి ప్రాగభావముకన్నఁ బ్రధ్వంసాభావమునే యూహించుటయుక్తము. కావున మార్గదేశికవితా విభేదనిరూపణములో నన్నిచోడుఁడు పాటించినప్రాధాన్యము కేవలము భాషకుఁగాక

తద్భాషాచ్ఛందస్సరణులకు మాత్రమేయని గోచరించును. ఆంధ్రదేశవిషయమునఁ గేవలము గీర్వాణచ్ఛందములకు సంబంధించిన స్రగ్ధర, శార్దూలము, చంపకోత్పలములు, మున్నగువృత్తములతో (అక్షరగణబద్ధములు) గ్రంథమంతయుఁ బ్రత్యేకముగాఁ దెలుఁగుభాషలోఁ గూర్పఁబడినది మార్గకవిత. దేశీయచ్ఛందములకుఁ జెందినకందము, గీతము, రగడ, అక్కర, సీసము, ద్విపద, తరువోజమున్నగు మాత్రాగణబద్ధపద్యములతో గ్రంథమంతయు నాంధ్రభాషలోఁ గూర్పఁబడినది దేశికవిత; అట్టిమార్గకవితాకావ్యములను, దేశికవితాకావ్యములను బ్రత్యేకముగ రచించినవారే వరుసగ మార్గకవులు దేశికవులునాఁ బరఁగుదురు. ఇట్టికవులు నన్నియ, నన్నిచోడులకాలమునాఁటికిఁ గొంత అయిన నుండియుందురు. నన్నయ తనభారతావతారికలో గీర్వాణకవులఁగాని, దేశికవులఁగాని యెవరిని బేర్కొనలేదు సరిగదా మార్గదేశిశబ్దములనయిన నుదాహరింపలేదు. నన్నిచోడుఁడు గీర్వాణకవులఁ గొంత ఆనామతఃపేర్కొని స్తుతించి మార్గదేశికవులను సాముదాయికముగ స్తుతించినాఁడు. కొందఱు సంస్కృతపదబాహుళ్యముతోఁ జెప్పిన తెలుఁగుకవిత (నన్నయభారతభాగము వంటిది) మార్గకవితయనియు, ఆంధ్రపదబాహుళ్యముతోఁ జెప్పినది (తిక్కనభారతము వంటిది) దేశికవితయనియు నిర్వచింతురనియుఁ దెలియుచున్నది. ఇదికూడ సరికాదనియే యెన్నఁదగును. జాను తెనుఁగుపయి మక్కువ వెలార్చిన నన్నిచోడునికుమారసంభవములోను, పాల్కురికి సోమునిద్విపదకావ్యములందును వలసినంత సంస్కృతపదబాహుళ్యమున్నది. కావున భాషాపదబాహుళ్యముతో నిమిత్తములేక కేవలము సంస్కృతచ్ఛందములకుఁ జెందిన వృత్తములతో నచ్చతెనుఁగులోఁ గూర్పఁబడిన కృతియైనను మార్గకవితగను ద్విపదలు, సీసములు, కందములు, రగడలు, గీతములు, గద్యలు, అక్కరలుమున్నగు దేశీయచ్ఛందములలో సంస్కృతపదభూయిష్ఠముగ రచింపఁబడినను నట్టికృతులు దేశికవితగను గణింపఁదగుననియే నాయభిప్రాయము. సంస్కృతవృత్తపదబాహుళ్యమెక్కువగను, దేశీయచ్ఛందఃపదసముదాయము క్వాచిత్కముగనుగల కృతులను మార్గకవితా

ఫక్కిఁగ నేఁడు స్థూలదృష్టితోఁ బలువురు పరిగణించుచున్నారు. కాని మార్గకవితకది సరియైన నిర్వచనముకాదనియే నేఁదలంచుచున్నాను. గ్రంథమంతయు దేశీయచ్ఛందములలోఁ గూర్పఁబడిన కృతులు ద్రవిడ కర్ణాటభాషలలోఁ బూర్వమునుండియుఁగలవు. కన్నడములో హరీశ్వరుని శివగణదరగళె, కెరెయపద్మరసు దీక్షాబోధ, రాఘవాంకుని హరిశ్చంద్రచరిత్రము, సిద్ధరామపురాణము, భీమకవి బసవపురాణము మున్నగునవి యిందుకుదాహరణములు. ఇవిముఖ్యముగ రగడలు, షట్పదులలోఁగూర్పఁబడినవి. అట్లే కేవలసంస్కృతవృత్తములలో గ్రంథమంతయుఁగూర్పఁబడిన మార్గకవితా కృతులుగూడఁగలవు. ఈనిర్వచన ప్రకారము నన్నయనన్నెచోడుల సమీపకాలములోవెలసి మనకుఁదెలియవచ్చిన యాంధ్రభాషాకృతుల నీక్రిందసూచించిన విధమున మార్గదేశికృతులుగా గణింపవచ్చును.

మార్గకవిత

(1) మల్లికార్జునపండితుని శ్రీగిరి మల్లికార్జునశతకము
(2) పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకము.
} చంపకోత్పల వృత్తములతోఁ గూర్పఁబడినవి

(1) మల్లికార్జునపండితుని శివతత్త్వసారము (కందపద్యఘటితము)
(2) పాల్కురికి సోముని బసవపురాణము
(3) ... పండితారాధ్యచరిత్రము
(4) రంగనాథరామాయణము.
} ద్విపదకావ్యములు
(5) పాల్కురికి సోముని చతుర్వేదసారము (సీసపద్యగణితము)
(6) ,, బసవరగడ, పంచప్రకారగద్యమున్నగు గేయలఘుకృతులు.

నన్నయభారతము, నన్నెచోడుని కుమారసంభవము, పాల్కురికి సోమనాథుని యనుభవసారము కేవలము మార్గకవితక్రిందఁగాని దేశికవితక్రిందఁగాని చేర్పఁదగినవికావు. ఇవిమార్గదేశి కవితాసమ్మేళనాత్మకములయిన కావ్యములు. ఇట్టిమిశ్రకావ్యములు కన్నడములో వీరికిఁబూర్వము చిరకాలమునుండి వెలసియున్నవి. కథావిస్తృతియే

ప్రయోజనముగాఁగల కావ్యములు, పురాణములు, ప్రబంధములు నాంధ్రభాషలో నిట్లుమార్గదేశికవితల సమ్మేళనముతోడనే కూర్పఁబడినవి. ఇందుకునన్నియు, నన్నిచోటులే మార్గదర్శకులు. ఇట్టి సమ్మేళనాత్మక కావ్యరచనమునకు బీజములు కొంతవఱకు ఉదాహరణాదిదేశికృతులలో నేర్పడెనని తలంపనగును. పద్యపదముల కలయికగల స్తోత్రగ్రంథముదాహరణమని లాక్షణికులు నిర్వచించియున్నారు. ఇందులో సప్తవిభక్తులలోఁ గ్రమంబుగ సంస్కృతచ్ఛందమునకుఁ జెందిన వృత్తమొకటియు దానిననుసరించి దేశీయచ్ఛందములందలికళిక, యుత్కళికయుఁ గూర్పఁబడును. పాల్కురికి సోమనాథుని బసవోదాహరణమున్నగునవి యిందుకులక్ష్యములు. ఆంధ్రభాషలో రానురాను విస్తరిల్లిన ప్రబంధవాఙ్మయము చాలవఱకు మార్గదేశికవితల సమ్మేళనముతోఁ గూర్పఁబడినవి. ఈవిధానమునకే వ్యాప్తియెక్కువయగుటచేఁ గాలము గడచిన కొలఁది మనభాషలోఁ గేవల మార్గకవితలు, దేశికవితలు సన్నగిల్లినవి. మొదటిది వృత్తములతోఁ గూర్పఁబడిన శతకరచనమునందును, రెండవది కంద, సీస, గీతపద్యములతోఁ గూర్పఁబడిన శతకములందును, ద్విపద కావ్యరచనమునందుమాత్రము కొంతవఱ కాశ్రయమునొందినవి.

అరుంధతీ వసిష్ఠము

శ్రీ బులుసు వేంకటేశ్వరులు బి. ఏ.

(అనువృత్తము)

గీ. చావుఁబుట్టువు లెఱుఁగనిజాణ వయ్యు
నిన్ను నీజాయఁ బ్రోవఁగా, నిలుప సాంఖ్య
తత్త్వము జగంబునన్ నాకుఁ దలఁపు కలుగ
నాత్మలీలార్థమై పుట్టు వందఁగలను." ౪౨

మ. అని విష్ణుప్రభు వాత్మధామమున కత్యైశ్వర్యలీలన్ సుప
ర్ణుని పై నెక్కి యదృశ్యమయ్యె; మునిశార్దూలుండు నా కర్దముం
డనఘాత్ముండు ప్రియంబునం జరియె బ్రహ్మానందనిష్యందమై
చనునాబిందుసరోవరంబునఁ దపశ్చర్యాదికార్యార్థమై. ౪౩

శా. అంతం గర్దమహాని యంచితతపోధ్యానానురక్తుండు ని
శ్చింతాస్వాంతుఁడు బ్రహ్మచర్యనియమశ్రేష్ఠుండు సర్వేశ్వరా
నంతప్రాభవదృగ్విలాసుఁడు జగన్నాథార్చితాంతర్యవే
దాంతజ్ఞానకృశాంగసుందరుఁడు బ్రహ్మానందియై యుండఁగన్. ౪౪

క. స్వాయంభువమను వాత్మ
ప్రేయసి శతరూపతోడఁ బ్రియకామగుణ
శ్రీయుత యగునాత్మజతో
నారయెడ కేతెంచి మ్రొక్కె సతిభక్తిమెయిన్. ౪౫

ఉ. మ్రొక్కినయంతఁ గర్దముఁడు మోదముతోడ బహూకరించి పెం
పెక్కినయాతిథేయమున నెంతయు వారికిఁ బ్రీతిఁగూర్చియున్
మక్కువ నాదరించె మనుమాన్యుని సర్వసపర్యలన్; గనన్
దక్కువయే మునీంద్రులకు ధార్మికరక్తియు భక్తియుక్తియున్. ౪౬

గీ. కర్దమునిఁ గాంచి యానందకలితుఁ డగుచుఁ
బలికె స్వాయంభువుండు సభక్తికముగ
వినయగౌరవభావంబు విశదపడఁగ,
చల్లకును వచ్చి ముంత దాఁచఁడు వివేకి. ౫౦

మ. "వరయోగీశ్వర! దేవహూతి యను శోభారాశి మత్పుత్త్రి నీ
కరకాంక్షన్ జనుదెంచియున్నది కనంగా నొల్ల దేనూనవుఁ
వర మీవే కృప నీవెఁ గైకొనఁగ సర్వశ్రేష్ఠుఁడౌ భర్త వీ
తరుణీశ్రేష్ఠకు; కింక నీవొసఁగు మోదంబంది యామోదమున్" ౫౧

క. అని వేడుకొనఁగఁ గర్దమ
ముని తొలుతటి విష్ణువాక్యమును స్మరియింపం
గని యిది లలాటలిఖితం
బని, తెలిపెను వినయగరిమ నామోదంబున్. ౫౨

గీ. తెలిపి "మనువర్య! సమయము కల దొకండు
నాకు నీపుత్త్రివలన సంతతి జనించు
వఱకు నిలిచెద గార్హస్థ్యపథమునందుఁ
బిదపఁ గైకొందు సన్న్యాసవృత్తి నేను. ౫౩

గీ. దీని కొడఁబడితేని యింతియును నీవు
భవ్యగుణవతి యైనయీభాగ్యరాశిఁ
గైకొనఁగ నాకుఁ బ్రీతియే కానఁ దెలుపు
యుష్మదభిమత" మని పల్కె యోగ్యభంగి. ౫౪

క. సతితలఁపు తనదుతలఁపును
సుతతలఁపును నొక్కభంగి సొంపలరుటచే
మతి సంతసించి యాశా
లత చిగిరింపంగ మనువు లలితగతి ననెన్. ౫౫

ఉ. "మానివతంస! సేవలకు మాకు మహాసుఖసిద్ధిఁ గూర్చె నెం
చేని పవిత్రవిప్రులకు నిట్టివ్రతంబె కదా యనారతంబునుం
బూనఁగ ధర్మ; మిట్టియెడఁ బూజ్యుఁడ వన్నిటఁ గాన నీకు నెం
తేని తగున్ మహాత్మ! యిది యెంతయు మాకు ననుగ్రహంబెత్రమా.

కం. మాపుత్త్రిఁ జెట్టవట్టిన
యాపుణ్యుఁడు పుత్త్రవంతుఁడై యాపిదపన్
శ్రీపుండరీకనయనుని
బ్రాపింపఁగ సన్న్యసింప భావ్యము కాదే? ౫౭

చ. తొలికొకనాఁడు మేడపయిఁ దొయ్యలి నెచ్చెలికత్తె లాలతాం
గులఁ గవగూడి లీలమెయిఁ గుందనపుందనుకాంతి యొప్ప నిం
పులు గులుకన్ ముఖాంబుజము పొల్పగు కందుకకేళి నుండ నా
నల నెటనుండియో పడియె వచ్చి యొకండు క్షమింపఁగోరుచున్.

కం. చెలికత్తియ యొక్కతె య
మ్మలశీఘ్రత వచ్చి విషయముం జెప్పఁగ మే
మల శరవేగంబునఁ జం
చలియించినచిత్తవృత్తిఁ జని కనుఁగొనఁగన్. ౫౯

గీ. అతఁడు గంధర్వజాతికి నధిపుఁడైన
వ్యక్తి విశ్వావసుం డనువాఁడు మమ్ముఁ
గాంచి వినయాంజలులను జోడించి పలికె
నిష్కలుష చిత్తవృత్తి నిర్నిద్రుఁ డగుచు. ౬౦

ఉ. "ఏమని చెప్పుకొందును మహీశ్వర! యోమునుసార్వభౌమ! నే
నీముదితన్ విమానమున నేఁగుచుఁ గంటిని గన్నయంతనే
నామది మోహమగ్నమయినన్ వివశంబయిపోయె వెంటనే
యీమహిఁ గూలిపోయితి నహీనపులజ్జ క్షమింపవేఁడఁగన్. ౬౧

ఉ. ఎంతపతివ్రతాతిలక మానవమోహన మోహనాంగి కో
యంతయుఁ దోఁచె నిట్లునయంతనె బుద్ధియు వచ్చెఁ గాన ని
క్కాంతపదాంబుజద్వయముఁ గాంచి తరింపఁగ దోషవార్ధి ని
శ్చింత యథేచ్ఛ మేఁగెదను శిష్యుని నన్ను ననుగ్రహింపవే! ౬౨

క. అని పలికిన విని మేమును
మనమున నచ్చెరువు దోఁప మహితాదరసం
జనితానందుని నాతనిఁ
గనికరమునఁ బంపఁ జనియె గంధర్వుండున్. ౬౩

ఉ. కావున మానిచంద్రమ! ప్రకాశిలు నీమె త్వదీయపత్నిగా
భావనసేయు నిన్నె భగవంతునిగా సతతంబు; నిట్టిక
న్యావరభిక్షఁ గైకొనుము; నన్ను నొనర్పుము ధన్యకాంక్షిగా
పావన మస్మదీయమనువంశము యుష్మదనుగ్రహంబునన్. ౬౪

గీ. కర్దమమునీంద్రుఁ డెంతయుఁ గౌతుకమునఁ
దెలుపఁగ నిజానుమతము; నుత్కృష్టఫణితి
మనుకులాచారవిహితధర్మప్రకార
మునను మునికిచ్చె దేవహూతిని జనకుఁడు. ౬౫

చ. మునికులసంప్రదాయమున మోదముతో మునిచంద్రుఁ డుత్తమం
బును బహుళోపయోగమును బూజ్యమునై నిజకర్మనిష్ఠ క
త్యనుగుణ మైనయాశ్రమమునం దిటు చొచ్చెను; ధర్మదీక్ష కెం
దును బరివర్జనీయమును దూష్యమునున్నదె యాశ్రమంబులన్. ౬౬

సీ. తనకీర్తి యాచంద్రతారకంబుగ నిల్వ
స్వాయంభువుండు విజ్ఞానిరత్న
మైనకర్దమమౌని నల్లునిగాఁ బరి
గ్రహియించి మిన్నందె గౌరవమున

అతఁడును శతరూప యతికష్టమున సుత
నెట్టులో మునిచేతఁ బెట్టి సహజ
విరహావేదన గెంటి వేయివిధంబులఁ
బుత్త్రిక నూరార్చి పోయి రంత

గీ. నాత్మదేశంబునకు; నెంతవైనఁ గాని
రొకరికొకరయి విడుతురే సకలసుఖము
లాత్మగేహంబు భోగంబు లవనియందు
నిలుచు తాత్కాలికప్రేమవలన జనులు. ౧౭

క. బిందుసరోవరతీరము
నం దాశ్రమ మొందు నిలిపి యత్యంతసుఖా
నందనిధానము గాఁగను
నందుండెను గర్దమర్షి యతివయుఁ దానున్. ౧౮

ఉ. ఉండి కులక్రమానుగత మున్నతసౌఖ్యనిధాన మైనయు
చ్చండతపోధనంబును బ్రశస్తవిరాగసుయోగసంపదల్
మెండుగ సంగ్రహించును నిమీలితనేత్రుఁడు దివ్యచక్షు వా
ఖండలతుల్యవైభవము గల్గఁగ నాతి సపర్య సల్పఁగన్. ౧౯

గీ. లక్ష్మి నారాయణునకుఁ బార్వతి శివునకుఁ
బలుకునఁబోఁడి బ్రహ్మకు భక్తితోడ
సేవచేసెడివిధము హర్షించి మించి
వారిఁ దలదన్నఁ దలఁపందు వారిజాక్షి. ౨౦

క. పతి ముక్తిఁ గాంచఁగనుటకు
వ్రతములు నుపవాసవితతి వలయునె? తలఁపన్
బతియే సమస్త మనుసు
వ్రతనిష్ఠయె చాలుఁ బరమభాగ్యము లందన్. ౨౧

మ. తరుణీరత్నము భక్తియుక్తి ఘనతాత్పర్యంబునన్ స్నేహాతి
త్పరతన్ నాథుసపర్య చేయుచును క్రోధద్వేషలోభాదిదు
ష్పరివారంబును గెల్చి యుత్తమమహాసాధ్వీత్వముంగాంచి యు
చ్చెరువుం గొల్పును జూచువారికి శుచిశ్రీనూత్నతేజంబులన్.

మ. మునిమూర్ధన్యుఁ డమానుషప్రతిభచే మోక్షాకరాత్మజ్ఞతా
ఘనయోగంబున విష్ణుసత్కృప మహాగంభీరుఁడై దివ్యశ
క్తి నివిష్టుం డయి దివ్యదృష్టియుతుఁడై తేజోమహారాశియై
యనిపించుం బరమేశుఁ డీతఁడె యనన్ వ్యక్తాత్మనిష్ఠాదులన్. ౨౩

మ. ఒకనాఁ డాతఁడు వత్సలత్వమున నెంతో ప్రేమ తొల్కాడ నం
తికమం దున్నసతీవతంసమును బ్రీతిన్ లాలనం జేసి "యో
శుకవాణీమణి! నా కసూయ యగు నిన్ జూడంగ నీవంటినాఁ
తుక, సాధ్వీమణి, నుత్తమవ్రతను నెందున్ జూడ నేకాలమున్. ౨౪

ఉ. నాకృపఁ జూఱగొన్న లలనామణి వోట సమస్తభోగముల్
నీ కిట లభ్యమౌను దరుణీ! తమిదీఱఁగఁ గోరుకొమ్ము త్వ
ష్ణాకలితుల్ కనుంగొననిసంపద లెల్లఁ గరస్థమౌను దృ
ష్ణాక్రమనిర్జితాత్ములకు సాధ్వి! జగంబున నూహచేయఁగన్. ౨౫

గీ. వలయునవి కోరుకొమ్ము సర్వంబు నేను
నీ కొనంగుదుఁ దన్వంగి! నిరుపమాన
నిత్యశుశ్రూషచేత ననిత్యదేహ
నిర్మమత్వముచేతఁ దన్పితివి నన్ను" ౨౬

చ. అని పలుకన్ గటాక్షకలితాననపద్మము లజ్జపెంపునన్
వినమితమున్ మనోహరము నిస్తులకాంతియుతంబు గాఁగ న
వ్వనరుహగంధి స్నేహసహవాసము లందిన సౌహృదంబునన్
వినయము పెంపునన్ బలికె విహ్వలతాభయభక్తియుక్తులన్. ౨౭

సీ. "ప్రాణేశ! నీమృదుపదకంజములె చాలు
క్షణికంబు లైన భోగంబు లేల?
యోగీశ! నీకృపా యోగంబె చాలును
క్షణికంబు లైనభోగంబు లేల?
మౌనీంద్ర! త్వద్భక్తి మహితచిత్తమె చాలు
క్షణికంబు లైనభోగంబు లేల?
జ్ఞానిచంద్రమ! భవత్సాహచర్యమె చాలు
క్షణికంబు లైన భోగంబు లేల?

ఇన్నియును నీ వెఱింగియు నిట్లు నన్నుఁ
గోరుకొ మ్మన నిరసింప ఘోరదోష
మగును నే నెట్లు పలుకంగ నౌను దేవ!
సర్వవిషయజ్ఞ! తెలియు నీ శక్తి నాకు. ౨౫

సీ. నియమవృత్తిని నిన్ను నిరతంబుఁ గొల్చినఁ
దనుకార్శ్య మది రవంతయును లేదు
నిద్రావిహీననై నిత్యంబుఁ గొల్చినఁ
మాంద్యంబె కలుగ దేమాత్రమైన
నిరుపమత్వత్సేవ నిరశననై యున్నఁ
గలుగ దేమాత్ర మాఁకలియు దప్పి
నిత్యోత్సవశ్రీల నెగడు నీకడ నున్నఁ
గల్గ వాధివ్యాధి కల్మషములు

గీ. వర్ష శతములు కడచినఁ బరమపుణ్య!
త్వన్మహాసేవ నున్నయుత్తమతవలనఁ
దరుణసంపద సడలదు; పరమహేయ
కామవాంఛాదికంబులు కడలుకొనవు. ౨౬

గీ. ఇదె మహాభాగ్య మిట్టులే యింక నుండి
భవ్యభవదీయ సఖ్యసంపదను మెలఁగఁ
గోరుకొందును కాని, దేవా! రహస్య
మొండు కల దది తెలుపోయ నెందుభయము. ౬౦

క. నవమోహనుండ వగునీ
ప్రవిమలతనుసౌఖ్య మంద భావము పోవన్
మిపులన్ భయమగు బాసన్
ధవ! సంతతి కలుగు నన్నుఁ ద్యజియింతు వనన్. ౬౧

క. సంతతి కలిగెడుదాఁకను
గాంతను గవగూడి యుండఁ; గాముకవృత్తిన్
సుంతైనఁ గనక పిదప ధ
రింతును సన్న్యాస మను నెఱింగితి మున్నే. ౬౨

ఉ. కావునఁ బ్రాణనాథ! నను గావఁగఁజూచెద వేని యాత్మ సం
భావనయుండెనేని ననుఁ బాయకయుండుము వంశవర్ధనా
భావము లేక పుత్త్రికలు పై సుతుఁడున్ జనియించి పెద్దవా
రౌవయసుల్ గడించి మనసంతతికిఁ దీర్పుము నాదుకోరికల్. ౬౩

గీ. పద్మపత్త్రాయతాక్షునిఁ బడసి సుతుని
గాఁగ నాతఁడు నాకు మోక్షం బొసంగు
దాఁక న న్నేలుకొనుము వాత్సల్య దృష్టి
సన్న్యసింపుము తగ యథేచ్ఛంబు పిదప. ౬౪

క. ఇది యుచితం బని ధవ! నీ
మదిఁ దోఁచెన యేని నీవు మన్నింపుము సన్
నుదతిని బలికిన పలుకులఁ
గొదవమె కలదేని క్షమయె కోరుదు" ననఁగన్. ౬౫

క. "ప్రియురాల! నీతలం ప
ప్రియముల కాకరము కాదు ప్రేమంబున నా
క్రియ లెల్ల నే నొనర్తును
భయ ముడుగుము నీవు నిజము ప్రాణేశ్వరిరో!" ౮౬

మ. అని మౌనీంద్రుఁడు తత్క్షణంబె నిజయోగానూనసత్త్వంబునన్
ఘన దివ్యన్మణి నిర్మితంబు సుభగాకారాత్మకోద్యాన శో
భ నవోదారము సౌధకేళిభవన ప్రాఘంబు దివ్యంబు నా
వనితామగ్నవిమాన మొక్కటిని జూపన్ బత్ని తబ్బిబ్బుగాన్. ౮౭

క. కని "తరుణీ! బిందుసరో
ఘనజలములఁ గ్రుంకులిడుము కల్గును నీకున్
వనజాక్షి ! సకలఫలము
ననుపమయోగం" బటంచు నాసతి యాయన్. ౮౮

గీ. దేవహూతి ప్రవేశింపఁ దీర్ఘమందు
నచ్చెరువు గాఁగఁ దోఁచిరి మచ్చెకంటు
లతులసూక్ష్మాంశుధారిణు లై కిశోర
నవవయశ్శోభిత లగుకన్యాజనములు. ౮౯

క. "పరిచారికలము నీ కో
తరుణీమణి ! సేవగొనుము తాత్పర్యమునన్
జరియింతుము కనుసన్నల
నరయుము కారుణ్యదృష్టి నమ్మా! మమ్ముల్". ౯౦

చ. అని కమనీయహేమకలశాదులఁ గర్పురవారిఁ దెచ్చి పెం
పున జలకంబు లార్చి సతిఁ; బుప్పొడి కస్తురి రాసి మేని క
త్యనుపమధూప మిచ్చి బహుళాభరణంబు లొసంగి పా
వనముగ వల్వలిచ్చి యతివన్ గయిసేసిరి వారొకింతలో. ౯౧

12. వాయువేగముచే వృక్షములు, పర్వతములు, రెండు కదిలినచో, వానిలో భేదమేమి కనఁబడును ?
13. పొలమున నగులుకొనిన, అగ్ని భూమిని కాల్చియు, సస్యాభివృద్ధికిఁ దగుశక్తినిచ్చుచున్నది.
14. పుణ్యాత్ములకోరికలు కల్పవృక్షమువలె శీఘ్రముగా ఫలించును.
15. సమయోచితముగఁ బ్రయోగించిన నీతియే సాఫల్యమును బొందుచున్నది.
16. యశోధనులకుఁ దమశరీరముకంటె యశస్సు మిక్కిలిప్రియమైనది. ఇఁక సుఖభోగసామగ్రినిగురించి చెప్పనదేమి?
17. గురువునాజ్ఞను, వృద్ధులయాజ్ఞలను, ఆలోచింపకయే గౌరవింపవలయును.
18. చంద్రుడు పరిపూర్ణముగ వృద్ధిపొందిన పిమ్మటనే క్షీణించును. సముద్రపు కెరటములుగూడ ఎగిరినపిదపనే తగ్గుచున్నవి.
19. తనహస్తములచే, నాటి పెంచిన విషవృక్షమునుగూడ తాను నఱకుట, యుచితముగాదు.
20. పెద్దలను దూషించువారేగాక వినువారలు గూడ పాపములను బొందుదురు.

మ. అదియే పుష్పక మాతఁడే ధనదుఁ డాయబ్జాక్షులే దేవతా
మదిరాక్షీమణు లంచు నెంచి జనముల్ మార్మాటలోనే యిసీ
యది కా దిట్టిమహాద్యుతుల్ కలవె యక్షాధీశునెమ్మేని కీ
సుదతీరత్నము లెన్న నెంతటి మహాశుద్ధాంగు లం చుండఁగన్. ౯౯

మ. శరవేగంబున నందు నేఁగి సుమనోజైత్రంబునం జూచి య
బ్బురపా టొందఁగ నందు నిండుఁ గల యంభోరాసులన్ దివ్యసుం
దరముల్ కేళివనంబులన్ గని మహానందంబునన్ సర్వలో
క రహఃకేళులఁ దేలుఁ దేలు ఋషి పొంగారంగ శృంగారముల్. ౧౦౦

గీ. పుండరీకాక్షుఁ బొడఁగన్న పురుషవరుఁడు
కర్దమమునీంద్రుఁ డతని కుత్కర్ష కలుగ
త్రిభువనంబులఁ గలదె ప్రాప్తింపనట్టి
యేపదార్థంబు కాని సమీక్షచేయ. ౧౦౧

చ. తనప్రతిభావిశేషమున ధారుణిఁ గల్గినకేళిభూములన్
గని కని యందు నిందుఁ దనకాంతను గేళులఁ దేల్చి తేల్చి పెం
పున దివిఁ గల్గుకేళివనముల్ గని లీలలఁ దేలియాడి య
మ్మునివరుఁ డేఁగుదెంచె నిజభూమికిఁ దృప్తసతీద్వితీయుఁడై. ౧౦౨

మ. శతవర్షంబులు వారు సౌఖ్యరసవర్షశ్రాంతులై యిష్టభో
గతతిన్ దేలిరి; దేవహూతి పతియోగప్రాభవం బెంచి సం
తతిఁ గాంక్షించెను; గర్దముం డతివసత్కాంక్షన్ నివారింపకే
సతిగర్భంబున నిల్పె వీర్యము నవాంశప్రాభవం బందఁగన్. ౧౦౩

క. అది మొదలుగ దినదినమును
మదిరాక్షికిఁ బెరుఁగఁజొచ్చె మహితం బగుసం
పద నాఁగ నాత్మగర్భము
త్రిదశులు మందారవృష్టి దివిఁ గురియింపన్. ౧౦౪

క. ఈవిధముగఁ గర్దమముని
సేవాఫల మనఁగఁదగినశ్రీసంతతి రా
జీవాక్షి దాల్చి కనె రా
జీవాక్షులఁ గాలవశముచేఁ దొమ్మండ్రన్. ౧౦౫

క. తొమ్మండ్రు సుందరాంగులు
తొమ్మండ్రును బూర్ణచంద్రతులితాస్యలు నా
తొమ్మండ్రును బద్మాక్షులు
తొమ్మండ్రును లక్ష్మితోడఁ దులతూఁగంగన్. ౧౦౬

గీ. హర్షమునఁ దేలి కర్దముఁ డాత్మపుత్త్రి
కలకుఁ బేర్లుంచె 1అనసూయ 2కళ యనంగ
3శ్రద్ధ నా 4హవిర్భువు నాఁగ 5శాంతి యనఁగ
6ఖ్యాతి 7క్రియ 8యరుంధతి నాఁగ 9గతి యనంగ. ౧౦౭

గీ. అమలశోభాయమానపద్మాకరమునఁ
దళతళల నీను శ్రేష్ఠపద్మం బనంగ
మణులలోపల నాయకమణివిధానఁ
దరుణచంద్రాస్య యానరుంధతి చెలంగు. ౧౦౮

క. జననీజనకులముద్దుల
కును వారు నిధాన మగుచుఁ గొమరుందనముల్
వినయాన్వితసౌశీల్యముఁ
గని పెరుఁగం దొడఁగి రతులగతిసంగతులన్. ౧౦౯

క. నవనవకాంతుల నీనుచుఁ
బ్రవిమలసరసీరుహప్రభాశోభితలై
పువ్విలుతుని నిశితాస్త్ర
ప్రవరంబులు నాఁగ వారు పరగుచునుండన్. ౧౧౦

గీ. బాల్యయౌవనమధ్య మావయసు వచ్చి
లలన లెల్లరు మిక్కిలి వెలయుచుండి
ఋషిసపర్యలు చేయ నూహింతు రహహ!
గతము తెల్పు ననాగతక్రమము నిజము. ౧౧౧

మ. పొరపొచ్చెంబులు లేక నెచ్చెలులుగాఁ బొల్పొంది వారల్ పర
స్పరవాత్సల్యవిశేషరాగములతోఁ బ్రాణంబు ప్రాణంబులై
పరమాంతఃకరణప్రవృత్తులను దివ్యప్రేమముం జూపుచున్
బెరుఁగం; జూచెద రెల్లరున్ బరమసంభావ్యంబుగా వారలన్. ౧౧౨

గీ. సానదీఱిన నవరత్నజాలము లని
పుటముపెట్టినబంగరుబొమ్మ లనియు
దివ్యకాంతు లీను మెఱుపుఁదీఁగ లనియుఁ
దోఁచినటు వారిఁ జెప్పుకొందురు జనములు. ౧౧౩

మ. మునిశుశ్రూషలు మానికాంతలవ్రతంబుల్ నిత్యకృత్యంబులై
జనవంద్యం బగుసత్ప్రవర్తనమె సత్సమ్మానితాచారమై
వినుతప్రక్రియ నాత్మవిద్యఁ గని తద్విఖ్యాతనిష్ఠాక్రమం
బొనరం జేసెడిదీక్షలే పనులుగా నొప్పారి రాకన్నియల్. ౧౧౪

గీ. కర్దమప్రజాపతి దివ్యకాంతు వలన
దేవహూతికిఁ బుట్టినదివ్యవనిత
లహహ! వారికిఁ గొఱఁతయే యమలగుణము
లవనిఁ దలిదండ్రులే బిడ్డ లౌట నిజము. ౧౧౫

గీ. ఇది యగు నరుంధతీవసిష్ఠీయకావ్య
రాజమునఁ బ్రథమాశ్వాసరాజ మీశ!
గురువరా! త్వత్కృపామృతఝరితమాను
కీనవాఙ్మయ మిదియు నంకితము నీకు. ౧౧౬

అరుంధతీ వసిష్ఠము

ద్వితీయాశ్వాసము

శ్రీమద్గురువర ! సత్కరు
ణామంద సుఖప్రదాత ! అద్వైతపథ
శ్రీమహితచిత్త ! శ్రీస
ద్బ్రహ్మామూల్య రసప్రవిష్ట ! ఆర్యమహర్షీ ! ౧

వ. తదనంతరకథాక్రమ మెట్టిదనిన. ౨

క. నవరత్నంబులపగిదిని
నవరసములరీతి వారనంతప్రభలన్
బ్రవిమలతేనువల్లరులన్
మివ్వులన్ జెలువొందుచుండి మెలఁగుచునుండన్. ౩

ఉ. కర్దమ మౌనిచంద్రమునిఁ గాంచి ప్రియంబున దేవహూతి సౌ
హార్దముతోడఁ బల్కెనిటు "లార్యఋషీశ్వర ! నీయెడందయా
మార్దవ మెంతేయున్ బరమమాన్యము, నాట సుపుత్త్రికాత్మ స
మ్మర్దము కల్గెఁగాని పరమంబగుపుత్త్రధనంబు లోటయా. ౪

క. శ్రీరమణి సుమను మఱి వా
ణీరమణిని బోలు పుణ్యనిధు లగుసుతలన్
ఏరమణి గన్న నాయమ
గారవమును గాంచలేదు కనక సుపుత్త్రున్. ౫

గీ. పుత్త్రవతి నైనకాంతతోఁ బోలఁజాల
రతులితైశ్వర్యయుత లయ్యు నబల లెందుఁ
బుత్త్రికలు వేయి మందియుఁ బుత్త్రుఁ డొక్క
నికిఁ దలంపఁగ లోచ్చంద్రు నీతినిధులు. ౬

మ. ఇహసౌఖ్యంబుల రోఁతఁబుట్టె నిఁక నే నిందుండఁగాఁ జాల నీ
కుహనాభోగము లల్పముల్; మఱియు నీకుంగోర్కె సన్న్యాసమ
నిహలోకంబున జన్మ మింకెపు తెఱంగే తెల్పి యుద్బోధరూ
పహితుం డైనసుపుత్త్రు నిచ్చి కృప దేవా ! నన్ను రక్షింపవే!”

క. అని విన్నవించు తరుణీ
మణి హృదయ మెఱింగి కర్దమఋషీశుఁడు “నీ
యనుపమయోగంబున శ్రీ
వనజాక్షుఁడు పుత్త్రుఁడగును వారిజనయనా !

మ. నిరతంబున్ దలపోయుచుండు మతనిన్ నీగర్భమం దాతఁడే
వరజన్మంబును గాంచు నిన్ను ననుఁ బ్రోవంజాలు సంసారసా
గర బీభత్సమునుండి లోకములరక్షం దాల్చు నవ్వానికిన్
దరుణీ ! కష్టమ ? నిన్ను నన్నుఁ గరుణన్ రక్షించి దాటించుటల్”.

గీ. అన్నమాటలు విని యామె యమితమోద
మంది శ్రీపుండరీకుని నాత్మఁ దలఁచు
వ్రతములను బూని యుపవాసవితతి సలిపి
విష్ణుచింతను దినములు వెళ్ళఁబుచ్చు.

గీ. కొంతకాలంబునకు భర్త గురుకటాక్ష
కలితయగు నామె కార్దమకలిత తేజ
మంద నారాయణుం డామెయందుఁ జొచ్చి
గర్భగతజీవుఁడై యుండెఁ గరుణ మెఱసి.

క. కాలక్రమమున నాయమ
లీలామాత్రుండు లోకలీలారతుఁడౌ
శ్రీలక్ష్మీదయితుని నొక
బాలునిగాఁ గనియె నామె భాగ్యం బెంతో.

గీ. కపిలమౌనిని నిజజన్మక్రమవినాశి
సతులయోగప్రభూతుని నాదిదేవుఁ
గడుపు చల్లనియాతల్లి కాంచినంత
దివ్యచిహ్నంబు లెంతయుఁ దేజరిల్లె. ౧౩

క. మందారవృష్టిఁ గురిసిరి
బృందారకు లెల్ల గగనవీథిని బరవా
నందినులై యప్సరసల్
సుందరముగ నాట్యమాడి చూపిరి ప్రీతిన్. ౧౪

చ. సరసజనాంతరంగములు సంతసమందెను; హోమవహ్ను ల
బ్బురముగ వెల్గె సుప్రభలపుంజము లయ్యె; సముద్రముల్ కలం
కతి సుభగంబు లయ్యెను; ఫలావళిఁ బుష్పములన్ సతంబులై
పరగెను వృక్షరాజి; ఫలవంతము లయ్యెను సర్వసస్యముల్. ౧౫

క. ప్రకృతికిఁ బరుఁడై వెలిఁగెడు
సుకృతులు జనియించునపుడు శోభిల్లెడియా
ప్రకృతికె యాకృతి నొసఁగిన
సుకృతివరు జనియింప మిగుల శోభిలకున్నే. ౧౬

క. కపిలావతారవేళా
సుపవిత్రత నెంచి బ్రహ్మసూనులతో స
య్యపవర్గకాంక్షిఁ గర్దమ
తపస్విని దేవహూతి దర్శించి వెసన్. ౧౭

చ. "పరమపవిత్రులార! భగవంతునిఁ బుత్త్రుని గాఁగఁ గన్న యో
గ రతులు మీరు మీ రెవనిఁ గాంచిరొ యాతఁడె దేవహూతి క
చ్చెరువుగ నిచ్చు మోక్షము; విశిష్టమతంబగు సాంఖ్యయోగమే
పరమమతంబుగా నిలుపు; భక్తులఁ బ్రోచును జ్ఞానదాతయై". ౧౮

(సశేషము)

క్రౌంచపదవృత్తలక్షణ విశేషము

[రచయిత - విద్వాన్ - శ్రీ రావూరి దొరస్వామి శర్మ]

క్రౌంచపదము సంస్కృత సమవృత్తము. సంస్కృతభాషావృత్తములన్నియు దెనుఁగున గ్రహింపఁబడుటచే నియ్యదియుఁ దెనుఁగులక్ష్య లక్షణగ్రంథములందుప యుక్తమై యొసలారుచున్నది. సంస్కృతాంధ్ర క్రౌంచపదవృత్తలక్షణములందును, దెనుఁగు క్రౌంచపద యతిఘటనయందును భిన్నరీతులు గానవచ్చుటచే నావిషయముల నిందు సమీక్షింపఁదలఁచియున్నాను.

సంస్కృతచ్ఛందంబులందుఁ గ్రౌంచపదలక్షణము:—

పింగళాచార్యవిరచితము

క్రౌంచపదా భ్మౌ స్భౌ నా నాగ్ భూతేంద్రియ వస్వృషయః (7 అధ్యాయ 30 సూ) ప్రతిపాదమునను 'భ-మ-స-భ-న-న-న-న-గ' గణములు, 5-5-8-7 అక్షరములపై యతులుండునని పై లక్షణము చెప్పుచున్నది. ఇయ్యది 25 (అతికృతి) ఛందమునఁబుట్టిన వృత్తమగును.

పై ఛందమున నీక్రింది లక్ష్యశ్లోకముదాహృతము.

'యాకపిలాక్షీ పింగలకేశీ కలిరుచి రనుదిన మనునయ కఠినా
దీర్ఘతరాభిః స్థూలశిరాభిః పరివృత వపురతి శయకుటిలగతిః
ఆయత జంఘానిమ్నకపోలా లఘుతర కుచయుగ పరిచితహృదయా
సాపరిహార్యా క్రౌంచపదా స్త్రీ ధ్రువమిహ నిరవధి సుఖమభిలషతా'

ఈ పైవిషయమునే యీక్రింది లక్షణము సైతము చెప్పుచున్నది.

క్రౌంచపదా భ్మౌ స్భౌ న న నా గ్గా ఇషుశరవసుముని విరతిరిహ భవేత్.

సంస్కృతలక్షణానుసారముగానే కన్నడభాషయందు నీవృత్తము వెలయుచున్నది చూడుఁడు.

'శీతకరోర్వీ వాతశశాంకర్ యుగమిత సురపుర నివహాదక డెయొళ్
భూతగణేశం భూతళ రాశా గజదశె యతిగళు మెసరిదె పెసరిం
నీతియుతే కేళ్ సాతిశయొత్కృ క్రమదొళె సెగళుదు దతిశయరచనో
పేతమశేషోర్వీతలకం క్రౌంచపదమతిశయ పద రచనెగళిం.

ఇయ్యది నాగవర్మరచిత కర్ణాటభాషాచ్ఛందములోనిది.

ఇఁకఁ దెనుఁగులక్షణము పరికింతము;

కవిజనాశ్రయమందు,

పంచశరాభా-సంచితపుణ్యా-భమసభనవయ - పరిమితమైనన్

గ్రౌంచపదాఖ్యం బంచితమయ్యెం-గ్రమయతి దశవసు-కలితము గాఁగన్.

పై తెనుఁగు క్రౌంచపదము 24 ఛందమునఁబుట్టినది. సంస్కృతమునందువలె 25 వ ఛందములోనిది గాదు దీనిగుణములు- 'భ-మ-స-భ-న-న-న-య' సంస్కృతవృత్తము కన్నఁ దెనుఁగున నొక యక్షరము తక్కువ. మాత్రాసంఖ్య సరిపోవుటచే రెండు నొక్కనడక గలవిగాఁ దోఁచుచున్నవి.

(సం)— భ - మ - స - భ - న - న - న - న - గ

(తె)— భ - మ - స - భ - న - న - న - య

సంస్కృతవృత్తము కడపటి 'నగము' తెనుఁగువృత్తమున 'యగణము' గా మాఱినది. రెంటికి 5 మాత్రలే; నడక యొకరీతిగానున్నను భిన్నచ్ఛందోజాతములనక తప్పదు.

సంస్కృతమున 5-5-8-7 పై యతులు నియతములు. కాని యందుఁ బద విచ్ఛేదమాత్రమాకాంక్షితము. తెనుఁగున యతివర్ణమైత్రిగలది. తెనుఁగు లక్షణమున 10-8 పై యతులు చెప్పఁబడెను. కడపటి 7 పై యతి సంస్కృతమునఁ బాదాంతయతి సూచించును. అందుఁ బాదాంతము తరువాతి పాదముతోఁ గలియరాదనునియతి యుండుటచేఁ బాదాంత యతి చెప్పఁబడును. తెనుఁగున నేవంవిధనియతిలేదు. మఱి సంస్కృతమున మొదటి 5 పై యతి గలదు. తెనుఁగు లక్షణమున నయ్యది చెప్పబడ లేదుగాని పై కవిజనాశ్రయ లక్షణపద్యమునను మఱి యీక్రింది లక్షణములందును 5 పై ప్రాసయతి కూర్పఁబడియున్నది. అనఁగా 5 పై యతి యుండుటకేమాఱు దానిప్రక్కఁ బ్రాసమైత్రి పాటింపఁబడినదని యెఱుంగనగు.

పంచశరాభా-సంచితపుణ్యా.........

క్రౌంచపదాఖ్యం-బంచితమయ్యెన్......

దీనినే ప్రాసాక్షరమును సప్తమస్థానమున నుంచుటయని ప్రకారాంతరముగా జెప్పవచ్చు.

ఈక్రిందిలక్షణములు పరికింపుఁడు

ఛందోదర్పణము-(అనంతుఁడు)

కాంచనభూషా-సంచయ మొప్పఁగ-ఘనకుచభరమునఁ-గవ్వవనియాడన్
చంచలనేత్రల్-వంచనతోడన్-సముచితగతినను-చని తనుఁ గొల్వన్
అంచితలీల-న్మించిన కౌశిక-హరిదిశ పరిమిత-యతులొనఁగూడన్
ముంచి రచింపం-గ్రౌంచపదంబి-మ్మొగిభమసభనన-ములనయలొందున్.

కావ్యాలంకార చూడామణి—

ప్రాంచిత తేజః-కుంచిత వైరీ-భమసభననన య-పరిచితరీతిన్
అంచితమయ్యెం-గ్రౌంచపదాఖ్యం-బనుగత హరిదిశ-యతి నభివృత్తిన్.

లక్షణసారసంగ్రహము (చిత్రకవి పెద్దన)

పంచయుగాహ్వల్ - క్రౌంచపదిన్ భ-శ్చమ సభననయ-పరిమిత మయ్యెన్-

పై లక్షణములంబట్టి చూడఁగా క్రౌంచము 24 వ ఛందమునఁ బుట్టిన వృత్తమనుట స్పష్టమగును. వీనియన్నింట 5-పై యతికి మాఱు దానితర్వాతఁ బ్రాసాక్షర మైత్రియు, తర్వాత 5-పై 8-పై పాదప్రథమాక్షరముతో యతి మైత్రియుఁ గూర్పఁబడియుండుట గానవచ్చుచున్నది.

సంస్కృత లక్షణమనుసరించి తెనుఁగు లాక్షణికులు 5 పైఁ బ్రాస యతియు, తరువాతి 5, 8 పై యతులను నియమించినారు. పాదాంతయతి తెనుఁగున కవశ్యము గాదు గానఁ దర్వాతి 7 పై యతి తెనుఁగునఁ జెప్పఁబడలేదు. తెనుఁగున మొదటి 5 పై యతికి మాఱు ప్రాసయతి ఘటనయొకటి విలక్షణముగాఁ గన్పట్టెను. 5 పై బ్రాసయతి తెనుఁగు లక్షణకారు లెవరు గంఠోక్తముగాఁ జెప్పరైరిగాని లక్ష్యములం దొండొరుల ననుసరించి కూర్చియున్నారని యెఱుఁగఁదగును. చిత్రకవి పెద్దనమాత్రము 'పంచయుగ' అని చెప్పియున్నాఁడుగాని యతిఁ జేని యది ప్రాస యతియని దెలుపఁడయ్యె. తక్కుంగలవారు మొదటి యైదవస్థానముపై యతి లక్షణమున నసలే చెప్పలేదు.

ఈ ప్రాసయతి ఘటనకుఁ గన్నడలక్షణము గొంత మూలమనవచ్చు. ఛందోంబుధియను కన్నడఛందము రచించిన నాగవర్మ క్రీ॥ శ॥ 990 ప్రాంతమువాఁడు. మన తెనుఁగు ప్రాంతముల కెల్లఁ బూర్వరచితమనఁదగు ఛందోంబుధిలోని క్రౌంచపదమున 5-పైఁ బ్రాసయతి ఘటితము.

'శీతకరోర్వీ-వాతశశాంకర'.........— (ఇంతఃపూర్వ ముదాహృతము) కన్నడబాసయందు యతి లేదు; ప్రాసమాత్రము కలదు.

సంస్కృత క్రౌంచపదములోని 25 అక్షరములను 24 గాఁ జేయుటయు, అందుఁ జెప్పఁబడిన మొదటి మూఁడుయతిస్థానములందుఁ బ్రాథమునఁ గన్నడభాష

పద్ధతిం బ్రాసమైత్రియుఁ, దర్వాతి రెంటికి సామాన్యయతి మైత్రియుఁ జెప్పుటయు వను నీ తెనుఁగులక్షణ పరిణామమునకుఁ గారణమై యుండునో యనూహ యైయున్నది.

పై కవిజనాశ్రయాదిచ్ఛందోనుసారములైన కతిపయలక్ష్యముల నీక్రిందఁ జూపుచున్నాను.

నన్నయ భారతభాగమునఁ గ్రౌంచవృత్తము లేదు; తిక్కనభాగమున స్త్రీపర్వమున నొకవృత్తము గలదు.

కౌరవసేనా-వీరుల లావుం-గడిమియుఁ గలయును-గడఁక వెలర్పన్
ధీరతసొంపుం-గ్రూరతపెంపుం-దెగువయు నెఱపఁగ-దెరలక వీఁకన్
బోరనఁ గ్రోధం-గారథసంబే-పునగలితనమును-బోలఁ బ్రవహింపన్
దారుణభయంబుం-గూరుటసంగా-వల పెను రుధిరము-వదనము నేర్పన్ (స్త్రీ 1-166)

కళాపూర్ణోదయము (6-225)

చంచలవీచీ-సంచయలీలా-చలలిత తరళిత-జలరుహపాళీ
సంచితహస్తా-దంచితభంగీ-జనిత మదనమత-సరణిగుణవ్యా
ఖ్యాంచితగోష్ఠీ-సంచరణప్ర-త్యయసముచితహారి-హాలికలతో రా
యంచలు ప్రేమాయం గొంచలుగాయన్-వ్యవహితపరరవ-మయిన కొలంకున్.

ఉత్తర రామాయణము (కంకంటి పాపరాజు)-7-144

తావుల మీఱం-బూవుల వావల్-దఱుమఁగఁ గురియఁగ దశఘనభేరుల్ఁ
గ్రేవల ప్రేమాయం-గేవలగీత-క్రియలను వనితలు-గిలికొని యాడన్
దేవత లెల్లన్-శ్రీవిభుఁ డెల్లన్-స్థిరమతిఁ గొలువఁగ-దివిజవిభుండున్
బావకముఖ్యా-శావిభుయుక్తిన్-బగతుని నడఁచిన-ప్రభుఁ గనవచ్చెన్.

ధర్మఖండము (భవానీశకవి) -4-102

వారిజగాత్రున్-వారిజనేత్రున్-వనజజముఖసుర-వరనుతిపాత్రున్
దారితవైరిన్-స్వైరవిహారిన్-దశముఖముఖఖల-దనుజవిదారిన్
పారపథామున్ శ్రీరఘురామున్ సరసిజహితకుల జలనిధిసోమున్
సారెనుతింపన్ గ్రూరులకైనన్ సమధికసుఖకలి సతతమునబ్బున్.

సీతారామాంజనేయసంవాదము (3-45)

సారపదార్థం-బారయుచుం దా-సకలనిగమములు-చదివిన నైనన్
జారువిశిష్టా-చారఘనుం డై-జపములు తపములు-సలిపిన నైనన్
స్ఫారసమస్తా-ధారసుతీర్థా-చరణములనిశము-జరిపిన నైనన్
గౌరవముం జే-కూరఁగ నీయో-గపరమసుఖము-గలుగదు వత్సా.

ఎఱ్ఱాప్రెగ్గడ తనదు హరివంశములో సంస్కృతానుసారము మూఁడుయతులు పాటించినాఁడు. తిక్కనాదుల క్రౌంచములందుఁగల ప్రథమప్రాసమైత్రి నుంచక యత్ప్రో సామాన్యయతిచే తీర్చినాఁడు. ఆపద్యమిది-

హరివంశము ఉ-భా-(9_259)

సారవివేకా-సౌఖ్యవిలోకా-సకలరిపుభయద-సముదసమీకా
♦ భూరమణీయా-బంధువిధేయా- పరహితకరుణా-ఫలసదుపాయా
ధీరచరిత్రా-దీపితగోత్రా-దివిజనగసదృశ-ధృతియుత గాత్రా
వీరవరేణ్యా-విశ్రుతపుణ్యా-వినయగుణవిజయి-విలసనగణ్యా.

తిక్కన యెఱ్ఱనల క్రౌంచపద యతి నియతియందే భేదము గానవచ్చెను.

ఈవృత్తమందే కాదు. కవిత్రయరచనలలోఁ బరస్పర మితరపద్యములందు యతి నియతిభేదము చూపట్టుచున్నది.

పృథ్వీ— నన్నయ మతమున 12-వ యక్షరము యతి
ఎఱ్ఱన ,, 9 ,, ,,
మధ్యాక్కర — నన్నయ— 4-వ గణముపై యతి
ఎఱ్ఱన — 3-వ గణముపై యతి
మానిని — నన్నయ— పాదమధ్యమున నొక్కయతి
ఎఱ్ఱన — మూఁడుయతులు
తిక్కన — ఉభయమతములు పాటించె.

ఇవి యిట్లుండఁగా, అప్పకవీయ క్రౌంచపదము ప్రథమప్రాసమైత్రి లక్షణమందుఁ జెప్పఁబడలేదు. లక్ష్యమందును ఘటితము గాదు. తర్వాతిరెండుయతులు (11 9 చోట్ల) విధింపఁబడెను. చూ- (అప్పకవీయము 4 ఆశ్వాసము)

పంచమకేశుండిచ్చిన భాస్వ-ద్వరమున మనమున-బవరము గోరన్
వంచనతో బాణాసుర హస్త-వ్రజములు దఱిగెను-వడిహరియంచున్
బాగ్గించితలీలన్ శంకరనంద-ప్రకటిత విరతులు_భమసథవాన్యల్
* క్రౌంచపదీవృత్తమ్మునఁ జెన్నౌ-నఁగఁబలుకుదురిలఁ-గవివరులెల్లన్.

అప్పకవికిఁ బూర్వులగు ఛందఃకర్తలీవృత్తలక్షణమున రెండుయతులే చెప్పిరి. అయిదవస్థానముపైఁ బ్రాసమైత్రి వారిలక్షణములో నుక్తము గాదుగాని లక్ష్యమున బ్రయుక్తము. అప్పకవి పూర్వుల లక్షణప్రోక్తయతిద్వయమును మాత్రము గ్రహించినాఁడు. కవి జనాశ్రయాదులందు లక్షణమునఁ బ్రాసమైత్రీనియమము చెప్పఁబడలేం

♦ పరహితకరుణా-తుదిసగణము నలము గానుండవలయు,లేదేని గణభంగమగు.

* సంయుక్తయతి నియతికీపాదము సరిపడకున్నది, ఏకాక్షరయతి మైత్రిలేదు. 'క్రౌంచ......జెన్నౌ-రఁగఁ బలుకుసురిల-రహిఁగవివర్యుల్' అనిసవరించుకోవచ్చు.

టచే, రమ్యతకై పూర్వులు ప్రాస ఘటించియుందురని కాఁబోలు నప్పకవి లక్ష్యలక్షణములందుఁ దాను యతిద్వయమునే కూర్చియుండునని యూహింపవలయు. 24-వ ఛందమందుఁబుట్టిన సరసిజమను వృత్తమునకీ క్రౌంచపదమునకువలెఁ బ్రథమమునఁ బ్రాసమైత్రియుఁ దర్వాత రెండుయతులును గవిజనాశ్రయాదులందు ఘటింపఁబడియున్నవి. లక్షణమున నందును జెప్పఁబడమిచే నప్పకవీయసరసిజమునఁ బ్రథమప్రాసమైత్రి ఘటితము గాదు.

పారిజాతాపహరణమందలి క్రౌంచపద మప్పకవీయమందుంబలె రెండు యతులు మాత్రము కలిగియున్నవి.

అంకురిత శ్రీసంగ భుజాంకా-హరిహయ మణినిభ-హరితనువర్ణా
సంకటకృద్దైత్యాళియశంకా-జనన నిజచరిత-శయధృతశంఖా
పంకజనాభా భంజితపంకా-పరమపురుషభవ-పరిభవనామా
శంకరభావా కిసలయసంకా-శపదయుగకలశ-శరనిధిశయనా.

ఈ పారిజాత కృతి పద్యము తుదిపాదమున గణములు క్రౌంచవృత్త లక్షణమునకు విలక్షణములుగానున్నవి. నేఁటిముద్రితప్రతుల నిట్లే వెలయుచున్నది. ఇదియొకరి ప్రమాదమో? 'శంకరభావా పల్లవసంకాశపదయుగకలశ శరధిశయానా

{శరనిధిశయ్యా / ,, శాయీ} ' అనియించుక మార్చిన సరిపడును.

అధునాతన బిల్వేశ్వరీయ కావ్యమందు నప్పకవీయమతమే పాటింపఁబడినది.

శ్రీరమణా నన్నారయు మీరావా-కృతికమఠమకిటి-నృహరివటూరా
మారఘురామా మాబలరామా-స్మరజయ యసితర-మహితసునామా
వారణరక్షా వాసవపక్షా-వరదయ వరదయ-వనఘనదీక్షా
వారదగేయా నీరదకాయా-నతసురవరతతి-నతిసువిధేయా. (ద్వితీయబింబము- 154)

ఇందుఁ జైకిఁబాచుటకుఁ బ్రథమచతుర్థపాదములందుఁ బ్రాసమైత్రియు; ద్వితీయతృతీయములందు యతిమైత్రియుఁ దోఁచెడుఁగాని, యతిప్రాసలలో నేదో యొకటి మాత్రమే నియతముగా నన్నిపాదములందు లేమిచేఁ గొక్కొండ వారిమతమునఁ బ్రథమదళమున యతిప్రాసలేవియు నభిప్రేతములు గావనుట గ్రాహ్యము.

కవిరాజమనోరంజనములో నీక్రింది క్రౌంచపదము గర్భవృత్తముగా రచితమై యున్నది.

శ్రీమహిమానీ-శ్రేయససీమా-చిరశుభకరవిల-సితగుణశీలా
సామజసంర-క్షానత పామా-సరసిజ భవసుర-సముదయపాలా
తామరసాప్త-స్థాపక ధామా-దరనినద చకిత-దనుసుతజాలా
తామసదూరా-ధామసుధామా-తరుణపజల జల-ధరనిభనీలా. (4-177)

ఇయ్యది కందద్వయ రుగ్మవతీ కమలవిలసిత గర్భక్రౌంచపదవృత్తము. ఇందుఁబంచమస్థానమునై యతి కవ్యభిప్రేతమో కాదో దృఢముగఁ జెప్ప వలనుపడదు. రుగ్మవతి గర్భితమగుటచేఁ బంచమయతి యనివార్యము. సంస్కృతానుసారము కవి పంచమయతి గూర్చియుండునని యూహింపనువచ్చును. ఎట్లున్నను నీకవి ప్రథమ ప్రాసను ఘటింపలేదని తెలియవగు.

అప్పకవీయమున గర్భక్రౌంచపదవృత్తమొకటికలదు. అందనివార్యమగుటచే మూఁడు యతులు ఘటితములు.

తెనుఁగుక్రౌంచపదము రుగ్మవతీ కమలవిలసిత వృత్తద్వయ సమ్మేళన మని యరయఁదగును. ఈక్రిందియప్పకవీయ గర్భ క్రౌంచపదము పైవిషయమును దెల్లమొనర్చెడు.

'ద్వారవతీనా-థాసముదారా,+తరుణధవళకర-ధరనుతనామా.'
(రుగ్మవతి) (కమలవిలసితము)

ఇఁక సంస్కృత క్రౌంచపదమో రుగ్మవతీ మణిగణ నికర సమ్మిశ్రమగును.
(యాకపిలాక్షీపింగళకేశీ)-(కవిరుచిరమతిన మనువయుక్తినా)

శ్రీ తేకుమళ్ళ రాజగోపాలరావుగారు రెండు తెలుఁగుల క్రౌంచపదము నను ఛందశ్శాస్త్రమునఁ జూపియున్నారు. (చూ. 6 ప్రకరణము-49-50 ప)

"క్రౌంచపదము-మ త య న న న న స.
శ్రీరమ్యత్వంబారఁగఁ బెంపూ-ర్జితముగ మణి విర-చిత మకుటములన్
(తిక్కన శ్రీ పర్వము)

మఱియొక క్రౌంచపదము-భ మ స భ న న న య.
తావులుమీఱన్-బూవులవానల్-దఱముగఁగురియఁగఁ-దళఘన ఖేరుల్
(సాపరాజు-ఉత్తరరామాయణము)"

ఏవంవిధముగ రచితమైయున్నది.

ఇందు రెండవది క్రౌంచపదమే; ఇతఃపూర్వము నాచేనుదాహృతము. మొదటిది సరసిజవృత్తము. తిక్కనభారతమున సరసిజవృత్తమునిదియే కలదు. సరసిజలక్షణము (కవిజనాశ్రయము)

మారాకారా-చారుచరిత్రా-మకరయన నవనవ-మహిమయుత రచనన్
సారంబైనన్-నారికవీంద్రుల్-సరసిజమునివినఁ-జదివిరి సభలన్.

ఇఁక నన్నిచోడకుమార సంభవములోని క్రౌంచపదము కొంత విలక్షణముగాఁ జూపట్టుచున్నది. చూడుఁడు.

చంచల వాహ్వా-దించుచు మలేఁదూం, ఝ్లకరవు ప్రియములకు-నలఁదుచు పైరో
మాంచములోలిం-గంచుకితంబై, పాదముఁగ నలరుచుఁ-బులినములంగ్రీ
డించుచు సంభా-షించుచుఁ బ్రీతిన్, బోలఁచుచుఁ జెలఁగుచుఁ-బోలయు సముద్యల్
క్రౌంచగతుల్ వీ-క్షించుచు భాస్వ, జ్జ్వలనుఁడు శరవణ-సరసికివచ్చెన్.

(కుమార -10-30)

ఇందలి యతిఘటన 'మురారేస్తృతీయః పంథా' యనునట్లు క్రొత్తమార్గము నద్రొక్కినది. ఇందుఁబంచమస్థానముపైఁ బ్రాసమైత్రియు, పదునొకొండవ యక్షరమునకు యతిమైత్రియుఁ గూర్పఁబడియున్నది. ఈయతి పాదప్రథమాక్షరమునకు సంబంధపడదు. రుగ్మవతీవృత్తదళమున (మొదటి పది యక్షరములు) తిక్కనాదులమార్గమునఁ బ్రాసమైత్రియు, కమలవిలసితవృత్తదళమున (తర్వాతి 14 అక్షరములు) నాభాగము ప్రథమాక్షరమునకు నష్టమాక్షరముపై యతియు ఘటింపఁబడియున్నది.
ప్రథమదళమునఁ బ్రాసమైత్రి, ద్వితీయదళమునఁ బ్రథమదళమునకు సంబంధము లేక యతిమైత్రి ఘటించుపద్ధతి యత్యంతము తెనుఁగురచనలో నపూర్వమనకతప్పదు. నన్నిచోడ కుమారసంభవపీఠికలో శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు, ఈవృత్తమును గూర్చి వ్రాసినవ్రాఁతలను దర్వాతివారు విమర్శించియున్నారు. వానినిందుఁ దడవుట చర్వితచర్వణమగు. కవిగారి వ్రాఁతలో నీక్రిందివాక్యముల మాత్రమించుక పరామర్శింపఁదలఁచితి.

"ఇందుఁ గంద సీసములవలెఁ బూర్వార్ధమునఁ బ్రాసమును ద్వితీయార్థమున విశ్రమము మాత్రమే కూర్పఁబడియె."

కందసీసములవలెఁ బాదము రెండుభాగములుగా విభజింపఁబడినది గాని, కందమువలెఁ బూర్వార్ధమునఁ బ్రాసము గూర్పబడెననుటలో నర్థము స్పష్టపడకున్నది. కందమున మొదట మూఁడుగణములు, తర్వాత నయిదుగణములుండును. మొదటి పాదమునకు రెండవపాదమునకుఁ బ్రాసము గలదు. ఆరెండవపాదము ప్రథమాక్షరమునకు నాపాదము మూఁడవగణముపై యతియుండును. క్రౌంచములో నట్లుగాక మొదటి భాగము పగములోఁ బ్రాసమైత్రియు, రెండవభాగమున యతిమైత్రియుఁ గలదు. కంద ప్రథమపాదము మధ్య ప్రాసమైత్రి లేదుగదా? అట్లుండఁ గందములోఁ గవి

గారు క్రౌంచమునకుఁ బోలికయెట్లు కుదిరించిరో కదా? మీఁదుమిక్కిలి కందమున మొదటిపాదము వేఱు, రెండవపాదము వేఱు. క్రౌంచపదమందువలె నొక్కటిగాదు క్రౌంచపదమందుఁ గందము గర్భితమేర్పడునను క్రౌంచపాదమాత్రలు కందపద్యార్ధమాత్రలకు సరిపడుచున్నను క్రౌంచ ప్రథమదళప్రాసగాని ద్వితీయదళయతిగాని గర్భకందమునకు జతపడనేరదు. చూ -

చంచుల నాస్వాదించుచు
లేడాండ్లకరువు ప్రియులకు-నలఁదుచు మైరో

ఇందుఁ బ్రాసయతులు రెండును సరిపడవు. కందమునకు సరిపడునట్లు వ్రాసినాఁడని యూహించుటకు వీలులేదు.

పోనిండు; సీసపద్యము వంటి దనుటయుఁ జెల్లనేరదు. ఏలయన సీసమందుఁ బ్రథమదళమున విధిగాఁ బ్రాసయు, ద్వితీయదళమున యతియు నియతము గాదుగదా!

నన్నయ క్రౌంచపదము నుపయోగింపఁడయ్యె. నన్నిచోడుని కాలమిది యిత్థమని నిరాక్షేపముగ సిద్ధాంతితము గాక 'ఎవరికివారే యమునాతీరే' యనునట్లుంటచే వాత నిందకిప్పించిన నిఁకఁ దిక్కనయే క్రౌంచపదవృత్త రచయితలలోఁ బ్రథముఁడని చెప్ప వలసివచ్చు. నన్నిచోడుఁడీయతి ఘటనలో నింతత్రోవఁ ద్రొక్కుటకేమి నిమిత్తమో దురూహముగానున్నది.

తెనుగువృత్తములందెల్లఁ బాదప్రథమాక్షరానుగుణయతి పాటించుటే సంప్రదాయమై తెలియుచున్నది.

కవిగారిది మఱియొక వాక్యము- 'తన్వి త్రిభంగి మొదలగు వృత్తములకు ద్వితీయప్రాసనియతికలదు.'

క్రౌంచపదములోఁగల ప్రాసనియమము తన్వీత్రిభంగులలోఁగలదనుచున్నారు కవిగారు. త్రిభంగిలోని ప్రాసనియమమునకుఁ గ్రౌంచప్రాసనియమమునకు బాదరాయణ సంబంధమున్నదనుట యందఱకుఁ దెలిసినదేకదా?

త్రిభంగిలోఁ బ్రాసమైత్రియే కాని యతిమైత్రి లేదు. మీఁదుమిక్కిలి యందుఁ బ్రథమదళమున మొదటిదిగాక రెండుమార్లు ప్రాసమైత్రియు, ద్వితీయదళమున నంతను ప్రాసము ముమ్మాఱుండును.

'వనరుహజకుని + కనదయలొదవఁగ + ఘనమతులాదట తోడ్త
శ్రుతి గూడన్ వెన్నునిఁ బాడన్' (ఛందోదర్పణము)

ఇందుత్తరదళ ప్రాసకుఁ బూర్వదళ ప్రాసకు సంబంధము లేదు.

త్రిభంగిలోఁ గవిగారి ప్రాసనియతి లేదుగదా!

ఇఁకఁ దన్విలోఁ బ్రాసనియతి గగనకుసుమముగానున్నది.

'దూడలతోఁ గాపరులను గుహలో + కౌంగిలిదాచిన విధి వదలింపన్,'

(అప్పకవీయము)

ఇందొక్క-యతియే యభిహితము. క్రౌంచసరసిజములందువలెఁ బ్రథమదళ ప్రాసయతికి గతిగానరాదు. ఏలయన 'దూడలతోఁగా+పరులను గుహలో' అను దళములోఁ బ్రాసఘటన గుదురదు. కవిగారే తన్వ్యంజూచి ప్రాసనియతి గలదని భ్రాంతిజెందిరో ?

ఇఁక ముందునకుఁ బోదము.

ఆనందరంగచ్ఛందమునఁ గస్తూరిరంగకవి క్రౌంచవృత్తమునే పంచశరవృత్త మనుపేర రచించినాఁడు.

'మించిన రుద్రప్రోధిని బందొ+మ్మిదిటను యతి తగి+మెఱసినయంతన్
బంచశరంబౌ రంగనృపాల+ప్రభుతిలక! భమస-భననయా ప్తిన్!'

ఇది యప్పకవీయలక్షణమువంటిదే; రెండుయతులుమాత్రమే చెప్పఁబడినవి. రంగకవి దీని కీక్రొత్తపేరేల యిడెనో? సర్వులు క్రౌంచపదమని యుద్ఘోషించియుండఁగా నితఁడుమాత్రమిట్లేల పేరుమార్చవలె? నాకిట్లు తోఁచెడు-భీమన కవిజనాశ్రయమున 'పంచశరాభాసంచితపుణ్యా' యని లక్షణమును మొదలుపెట్టుటను జూచి పంచశరమని నూతననామకరణమును రంగకవిచేసినాఁడు కావలయు.

శ్రీ వేదము వేంకట్రాయశాస్త్రులవారి ఛందస్సులోఁ గ్రౌంచపదలక్షణ మిట్లున్నది. క్రౌంచపదము (భ-మ-స-భ-న-న-న-య- ౧౧)

పంచశరారిన్ గ్రౌంచపదంబౌ-భమసభననయ-పరమేష్ఠియతిన్

కుండలీకరణములోను లక్షణములోను 'భమసభననయ' గణములున్నవి. లక్ష్యమునఁ బంచమస్థానముపైఁ బ్రాసయుఁగలదు. లక్ష్యపాదమున భమసభననసస గణములున్నవి. ఇది ప్రమాదపతితమా?

సంస్కృతక్రౌంచపదలక్షణమును శ్రీ గిడుగు సీతాపతిగారు ఛందోదర్ప ణోపోద్ఘాతమున నీక్రిందిరీతిఁ జూపినారు.

'క్రౌంచపదా భ్మౌ స్మౌ న న నాన్గా విషుశరవసుముని విరతిరిహాభవేత్'

ఇందుఁబొరపాటున్నది; అచ్చు పొరపాటేమో ?

'క్రౌంచపదా భ్మౌ స్భౌ నన నాన్గా' అనియుండవలయు

సంస్కృతవృత్త రత్నాకరమున నీవృత్తలక్షణ మీక్రిందిరీతి భిన్నముగానున్నది

'క్రౌంచపదాత్త్రౌ భరౌనన నానగౌ మునిశరవసుశరవిరతియుతా!

గణములు-భ-స-భ-ర-న-న-న-న-గ; యతులు-7-5-8-5.

వృత్తరత్నాకరమునకు మణినిధి సమాఖ్యవ్యాఖ్యరచించిన నారాయణపురోహితుఁడుపై లక్షణపాఠమే వివరించి యీక్రింది లక్ష్యముదాహరించె.

పాండుసుతేభ్యోమహీం తు నరేంద్రదేహీశకుని మతరతసకలభృత
నైవహిచేత్త్వంరణాయ కురుష్వబుద్ధిమతులవిపుల ధనురపిబలైః
యాదవనాథే తదేతి గిరైక మాధవతిసదసి ఝుటితినరపతిః
క్రౌంచపదా క్రౌంతగాంచ ధరాంవనాత్ర దిశతిమతిరితి పగిరమదాత్.

శ్రీనాథుఁడను మఱియొక వ్యాఖ్యాత పైలక్షణము కొంతమార్పుతో నిట్లు గ్రహించి వివరించినాఁడు.

'క్రౌంచపదాభ్మౌ స్జౌ నననానగా విషుశరముని వసుయతిరిహాభవేత్'

భ-మ-స-జ-న-న-న-న-గ; 5-5-7-8 యతులు.

ఈ లక్షణము దొలుదొలుతఁ జూపిన సంస్కృతలక్షణమునకు ముక్కాలుమువ్వీసము చేరువగానున్నది. నాల్గవగణమందే రెంటిభేదము. అందు భగణమున్నది, ఇందు జగణమున్నది. వృత్తరత్నాకరమున భగణమునకు జగణము లేఖక ప్రమాదజనితమే కాయను సంశయము వొడముచున్నది. ఇదియెట్లున్నను నారాయణ పురోహితుని పాఠము తదుదాహరణము క్రొత్తగాఁ గన్పించుచున్నది. సంస్కృతగ్రంథ మహోదధియందీవృత్తరత్నరచనావిధానము నింకను బరిశోధింపవలసియున్నది.

* గుణచంద్ర విరచితమగు కన్నడఛందస్సారమునఁ గ్రౌంచ పదలక్షణమిట్లున్నది.

'క్రౌంచపదం భభరం నననం నగం మునిశర వసుశర విరతియుతం'

(భ-భ-ర-న-న-న-న-గ—గణములు; 7-5-8-5 యతులు)- ఇవి లక్షణమునఁ జెప్పఁబడ్డవి. లక్షలపాదమును గణవిభజనచేయఁ బై రీతిగాలేదు. అందేర్పడు గణములు— భ-భ-భ-ర-న-న-న-న-గ; ఒకభగణ మెక్కువయున్నది; లక్షణమున వదిలక్కువరైనది. ఇందుఁ బ్రాసప్రథమదశమున లేదు. ఈవృత్తమున కథసూచిక లో నిట్లున్నది— "ఈలక్షణవృత్తాంతం వల్లిరువ లక్షణక్కె భిన్నవాగిదెఁ (భమసభ ననననగ).

ఒక్క తెనుఁగునందు మాత్రమే క్రౌంచపదము 24 ఛందము లోనిదయ్యెను. "జంటకందమును హరిగతిరగడను కలిపిబంధముగా చేర్చుటకీ జేశిలో ఏకాక్షర లోపమత్యావశ్యకమగుచున్నది యనియు, సంస్కృతములోను కన్నడములోను 25

---

* Annals of Oriental Search - Madras University volume VI Part 2, 1941—42 లోఁ బ్రకటితము.

అక్షరములుగానున్న క్రౌంచము తెలుఁగులో 24 అక్షరముల క్రౌంచగతిగామాఱుటకు కారణమిప్పటికైనను విమర్శకులకు బోధపడకపోదనియు"- నన్నెచోడకవిచరిత్రలో శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు విరచించిరి. ఈయంశము పరిశీలింపఁదగినదిగానున్నది. సంస్కృతక్రౌంచమునఁగాని తెనుఁగుక్రౌంచమునఁగాని మాత్రాసంఖ్యలో భేదములేనిచో జంటకందము రెంటికిసరిపడును, చూడుఁడు.

తెనుఁగు క్రౌంచము—

ద్వారవతీనా-థాసమదారా-తరుణధవశేకర-ధరనుతనామా

దీనినే కందముగ వ్రాయనగు.

ద్వారవతీనాథాసమ

దారాతరుణ ధవశేకర-ధరనుత నామా.

పై క్రౌంచము కడపటి గగమును సగణముగాఁజేసిన సంస్కృత క్రౌంచమగు.

ద్వారవతీ నా-థా సమదారా-తరుణధవశేకర-ధరనుత మహిమా.

మాత్రాసంఖ్య మారదు; ఇదియుఁ గందమునకు సరిపడును.

ద్వారవతీ నాథా సమ

దారా తరుణ ధవశేకర-ధరనుత మహిమా.

దీనింబట్టి కందము కనుటకై ఏకాక్షరలోపము నావశ్యకమని తేలినది.

ఇఁక హరిగతిరగడ కొఱకై యీమార్పు జరిగెనాయని యాలోచింపవలయు.

నాలుగుమాత్రల గణములగు 'నల - గగ - భ - స'లు హరిగతి పాదమున కెన్మిదియుండును.

యతి నాలుగు గణములమీఁద - అనఁగా 16 లఘువులపై నుండును. ఆద్యంత ప్రాసలుగలవు.

'ఇతరముల కలవడ దని నృపలఘు యతి-నిధ నల గగ భసల నగుచు హరిగతి' (ఛందోదర్పణము)

సంస్కృతాంధ్ర క్రౌంచములకు రెంటికి హరిగతి సరిపడుచున్నది గదా !

ద్వారవ, తీనా, థాసమ, దారా, తరుణధ, వశేకర. ధరనుత, నామా (మహిమా).

తుదిగణము సంస్కృతమున సగణము, తెనుఁగున గగము ; రెండు రగడకు సరిపడును.

దీనింబట్టి యేకాక్షరలో పావశ్యకతకుఁ బ్రసక్తిలేదని తెల్లమగుచున్నది. నన్నిచోడుండట్టి యభిప్రాయముగలవాఁడైనచోఁ బాదాద్యక్షరానుగుణయతి పెట్టియుండవలయు. అప్పట్టునవే రగడ యతిచెల్లును. తిక్కనాదుల క్రౌంచము హరిగతి రగడ యతికిఁబొసఁగుచున్నది, కాని నన్నిచోడుని యతినియమము (ప్రథమాక్షర సంబంధములేక ద్వితీయదళ ప్రత్యేక యతినియతి) హరిగతిరగడగాఁ జదివినచోఁ బొసఁగ నేరదు. ఒకవేళ మధురగతి రగడయగునేమోయని పరికించిన దానికిని పొందికపొసఁగకున్నది. ఎట్లన-హరిగతికి సగము మధురగతి పాదమునకు నాలుగుగణములు, రెండు గణముల పైయతి, అత్యంతప్రాసలుగలవు

'శ్రీవనితాధిపుఁ-జేరి భజింపుఁడు
భావజజనకుని-భక్తిఁదలంపుఁడు'

నన్నిచోడుని క్రౌంచమీ తెలుఁగున రచించిన పాదిప్రాసము, ప్రథమపాదయతి రెండు తప్పుచున్నవి.

చంచలనాస్యా-డిందుదు లేఁదూం (యతిభంగము)
ప్లకరువు ప్రియలకు-నలఁదుమపైరో (ఆది ప్రాసభంగము)

ఎటుచూచినను రెడ్డిగారుచెప్పినచొప్పు చొప్పడకున్నది. నన్నిచోడున కట్టియభిప్రాయమేయుండియున్నఁ గ్రౌంచమును గర్భవృత్తముగా వ్రాసియుండును; పాదాద్యక్షరాను గుణయతి పాటించియుండును.

రెడ్డిగారు, ఈసందర్భమున 'హరిగతిరగడను రెట్టించినచో మధురగతిరగడయై' అనివ్రాసిరి. మధురగతి రెట్టించిన హరిగతియగునని తెలియునది.

'కదియతి వలభిస-గగముల సంతతి
హరిగతిలో సగ-మగును మధురగతి'
అని చిత్రకవిపెద్దన లక్షణసారసంగ్రహము.

ఇందాఁకఁ బరామర్శించిన లక్షణముల నీదిగువ సంగ్రహించెద,

సంస్కృత క్రౌంచపదము- (25 ఛందము)

గణములు	యతులు
1. భ-మ-స-భ-న-న-న-న-గ	5-5-8-7
2. భ-త-భ-ర-న-న-న-న-గ	7-5-8-5
3. భ-మ-స-జ-న-న-న-న-గ	5-5-7-8

కన్నడ క్రౌంచము (25 ఛందము)

1. భ-మ-స-భ-న-న-న-న-గ	5 పైఁబ్రాస, 5-8 యతి
2. భ-భ-భ-ర-న-న-న-న-గ	7-5-8-5. (ఇందుఁబ్రాసలేదు)

తెలుఁగు క్రౌంచము, (24 ఛందము)

1. భ-మ-స-భ-న-న-న-య — 5 పైఁబ్రాస, 5-8 యతులు

(5 పైఁబ్రాస యనఁగా 5 అక్షరములపై యతి యుండవలయు, దానికి మాఱు కతిపయములందు వలెఁ బ్రాసయతియని యర్థము ప్రాసయని యన్నది యత్యక్షరము తరువాత పాదద్వితీయాక్షర మావృత్తియగుట)

2. భ-మ-స-భ-న-న-న-య — 5-5-8 యతులు.
3, ,, ,, ,, — 10-8 ,,
4. ,, ,, ,, — 5-ప్రాస, 10-18 ప్రత్యేకయతి.

(పాదాద్యక్షరానుగుణయతి కాదనుట.

5. భ-మ-స-భ-న-న-స-స — 5 ప్రాస, 5-8 యతి

ఏవంవిధముగఁ గ్రౌంచలక్షణము భిన్నరీతుల గానవచ్చెను. తెనుఁగున నెవ్వరును 25 క్షరములు గల క్రౌంచము రచించినట్లు గానరాదు. భమసభననయ గణముల తోడి 24 అక్షరముల క్రౌంచము తిక్కనాదు లుపయోగించుటచే నయ్యది సర్వథా గ్రాహ్యము. కాని సంస్కృతానుసారము రచించుటయు నవిూచనమే యగు. తెనుఁగు వారికి యతియతిలోఁ బరస్పరము భేదము పొడకట్టుచున్నది. తిక్కనాదులంబోలి 5 పైఁ బ్రాస, తర్వాత రెండుయతులుగాని, ఎఱ్ఱనాదులంబలె మూఁడును యతులుగాఁగాని, అప్పకవీయాదులమాదిరి రెండుయతులేగాని ఘటించి రచింపవచ్చును.

ఈ వృత్తమందే కాక యింకెన్నో వృత్తములందిట్టి భేదములు గానవచ్చెడు. వీనినెల్లఁ బర్యాప్తముగాఁ బరిశీలించి తెనుఁగు ఛందస్సర్వస్వము రచించుట తెనుఁగు లాక్షణికులకర్తవ్యమైయున్నది. ఇకార్యమునకుఁ బ్రాచీనలక్షణగ్రంథములన్నియు ముద్రితములుగావుట యావశ్యకము. సమగ్రాంధ్రచ్ఛందోరచనకు భాషాపోషకు లందారులు తోడ్పడుదురు గాత.

శ్రీ కాళిదాసుని కావ్యసూక్తులు.

శ్రీ విద్వాన్ సాహిత్యవిశారద, యస్. కె. బి. కృష్ణమాచార్యులు

1. సువర్ణము శ్రేష్ఠమయినది, కానిది, అగ్నియందు వేయుటవలనే తెలియఁబడుచున్నది.
2. మనుష్యుని సద్గుణములు, అన్నివిషయములందు, యోగ్యమైన స్థానమును, పొందుచున్నవి.
3. వినయమే మహాపురుషుల క్రోధమును శాంతింపఁజేయుసాధనము
4. సజ్జనులు మేఘములవలె నితరులకు నిచ్చుటకొఱకే తాము గ్రహింతురు.
5. అగ్న్యాతపముల స్పర్శచే జలము, ఉష్ణమగుచున్నది. గాని అది స్వభావముగ చల్లనిదే.
6. నక్షత్రములు, గ్రహములున్నను, రాత్రి చంద్రునివలననే ప్రకాశించుచున్నది.
7. సహజముగ మనుష్యునిమనస్సు పూర్వజన్మసంబంధమును దెలిసికొనఁగలుగుచున్నది.
8. కఠినమగు లోహముకూడ, అగ్నిజ్వాలలోఁ గరగుచున్నది. శరీరధారియగు మనుష్యునిగూర్చి చెప్పనేల ?
9. ఈశ్వరేచ్ఛచే విషమొకప్పుడు అమృతమగును. మఱొకప్పుడు, అమృతమే విషమగును.
10. మనుజులధర్మాచరణమునకుఁ బ్రధానకారణభూతులు త్తమస్త్రీలే.
11. అజ్ఞానులు తమప్రియజనుని మరణమును హృదయమందున్న క త్తి వలెభావింతురు. జ్ఞానులు దానినే శుభద్వారముగఁ దలంతురు.

— విమర్శకలక్షణములు —

"సాహిత్యాచార్య" శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట
హనుమంతరావు ఎం. ఏ.

ఏ భాషాసాహిత్యమైన విమర్శవలననే దీప్తిమంతము, బహుళ వ్యాప్తము, ప్రవర్ధమానము కాఁగలుగును. విమర్శకుని అందుచేతనే సాహిత్యోద్ధారకునిగా గణింపవలసియున్నది. విమర్శకుఁడనఁగా అయిన దానిని, కానిదానిని చెడతిట్టెడి పండితుఁడను భ్రమ యుండుటవలన లోకములో చాలకాలము వఱకు విమర్శకునకు గౌరవము లభింపక వచ్చినది. కాని విమర్శకుని బాధ్యత గురుతరమైనది; సాహిత్యార్ణవ కర్ణధారి కాఁదగిన అతనికి కొన్ని యుత్తమలక్షణము లనఁదగినవి లేక పోలేదు. ప్రాచ్యపాశ్చాత్య పండితులెందఱో ఆ యా సూత్రములను దక్షతతో విచారించియున్నారు.

విమర్శన మొక కళగా పాశ్చాత్యు లుపాసించినారు. ప్రాచ్యులు దాని నొక పాండితీవైభవముగా గమనించినారు. పాశ్చాత్య విమర్శకుల దృష్టి స్థూలమైనది (Comprehensive outlook). చారిత్రిక పరిశీలనము (Historical perception) సూత్రవిభజనము (Analytical treatment) తారతమ్య పరిశీలనము (Comparative study) వారి విశిష్టలక్షణములు. ప్రాచ్యవ్యాఖ్యాతలు నిశితదృష్టితో సూక్ష్మపరిశీలనము చేయువారు. వారిది యెక్కుడుగా శాబ్దికవిమర్శ ప్రామాణికదృష్టియు, ఈ రెండు దృక్పథములకు సమన్వయము సాధించుకొను తలంపుతో విమర్శకలక్షణములను గ్రహింతము.

విమర్శకుఁడు కవి వలె ద్రష్ట; స్రష్టయున్ను. నవనవోన్మేష శాలిని అయిన ప్రజ్ఞ అతనికిఁ గూడ సహజముగా నబ్బవలసినదే. లోక

శాస్త్ర కావ్యాద్యవేక్షణము చేత నతఁడును వ్యుత్పన్నుఁడు కావలెను. బహుకావ్య పఠనమువలన మనోముకురము విశదీభూతమగును. క్రమముగా తన్మయీ భావన యోగ్యత యతనికి చేకూరును. అప్పుడాతఁడు సహృదయుఁడగు చున్నాఁడు. అపుడు కవి చిత్రించిన భావములతోడను, పాత్రలతోడను, వర్ణనములతోడను పరిచయ మేర్పడి, కవిహృదయ ప్రవేశము చేయకలిగి, ఆయాప్రకరణములందు లీనమైపోఁగలిగి, రసానందానుభూతిని పొందఁగల్గును. ఇందులకు విమర్శకుఁడు కేవలము బుద్ధివైభవమును, శాస్త్రజ్ఞానమును మిక్కిలిగా పెంపొందించుకొన్నందువలన ప్రయోజనము పూర్తిగా సమకూడదు. వీనితో నాతఁడు తన హృదయకమలమును నవనవము, సుకుమారము, ఆర్ద్రీభూతము చేసికొని రసపిపాసువు, కళాశీలి కావలెను. అనఁగా విమర్శకోత్తముఁడు హృదయములేని శుష్కపండితుఁడు కాఁడని తెలియవలెను. అట్లే తార్కికశక్తిలేని పండితుఁడు విమర్శక శిఖామణి కానేరఁడనుట తథ్యము.

శబ్దస్వరూపము-అర్థగౌరవము - భావగాంభీర్యము - ఆలంకారిక చమత్కృతి - రసపోషణము - శిల్పవ్యక్తి - మొదలైన విషయముల నన్నిటిని అతఁడెఱింగి యుండవలెను. అనఁగా లాక్షణిక సూత్రపరిజ్ఞానము విమర్శకుని కెంతయు నవసరమైనది. కేవల మా సూత్రముల నన్నిటిని వల్లెవేసిన పండితుఁడయిన ప్రయోజనము లేదు. అన్వయము చేయఁగల ప్రతిభావంతుఁడై యుండవలెను. అనగా లక్ష్య లక్షణ సమన్వయ శక్తిగలవాఁడు కావలెనన్నమాట! అంతటి శక్తిసంపన్నుఁడైనవాఁడు అనహంకారిగానుండఁజాలఁడు. అహంకారి అయినవాఁడు, విమర్శనమునకుఁబూనుకొనరాదు. అట్టివాని విమర్శ దోషైకదృష్టితోఁగూడినట్టిదగును. లేకపోయిన స్వీయపాండితీప్రకర్షతో నిండియుండును. వైయక్తికాభిరుచులకెక్కువస్థానములభించును. కేవల వైయాకరణిఅయినచో శాబ్దికచర్చలతో, సాధుత్వాసాధుత్వ విచారముతో తలనొప్పికలిగించును. కనుక విమర్శకుఁడు తానెంతటి విద్వన్మణి

అయినను వినయ శీలముకలిగి కవిని కావ్యమును ఆదరముతో పరయ గల్గు సహనము, సహృదయత్వముల నలవఱచుకొనవలసియున్నది.

కావ్యమందు దేశకాల పాత్రలనెఱిఁగి సాహితీ విమర్శచేయ నొప్పునేకాని విమర్శకుఁడు తనకాలమునాఁటి సులోచనములతో, నాఁటి యభిరుచులతో, కొలబద్దలతో పరిశీలింపరాదు. కవి ప్రతిపాదించినభావము లనాఁడుపయోగించిన శబ్దములనుండి గ్రహింపప్రయత్నము చేయవలె నేకాని విమర్శకుఁడు తన యూహలను, తనపాండితిని జొనిపి యితర ములఁ బ్రదర్శింపరాదు. మల్లినాథుఁడు వ్యాఖ్యానకర్తగా పూనిన ప్రతిజ్ఞ శ్లాఘ్యతమైనది. మూలమందులేని దానిని స్పృశింపక మూలమునే యనుసరించి యందలి వెలుఁగు జిలుగులను తీరుతీయములను, విమర్శించు టయే - లెస్సగా విచారించుటయే - విమర్శక లక్ష్యమై యుండవలెను.

చారిత్రికదృష్టి, తారతమ్య పరిశీలనము, విమర్శకున కెంతేని యవసరములు. వీనితో అనుకృతులు-మాతృకలు-వాని ముందువెను కలు-నిర్ణయింప ననుకూలించును.

పరిచయకర్తగా-గుణగ్రహణ పారీణుఁడుగా - వందిగా-వ్యాఖ్యా తగా - న్యాయమూర్తిగా-విషయవివేచనమునుండి రసాభివ్యక్తి వఱకు గల వివిధస్థితులతోను సామాన్యపాఠకుని నడిపించి, శిక్షణమొసఁగి అల రించి, ఆనందమును పంచి యమృతత్వ స్థితికల్గించునట్టి యుత్తమదార్శని కుఁడే విమర్శకుఁడు. అంతటి యధికారము, అప్రమత్తత లున్నవాఁడే హ్లాదైకమయము, నవరసరుచిరమయిన మధురజగత్తును సృజింపఁగల సమర్థుఁడు కాఁగల్గును. అట్టి విమర్శకుఁడు కవివలె ప్రజాపతిత్వము పొంది సమ్మానము నందఁగలఁడు; సాహిత్యగహనమున రాచబాట లను వేయఁగలఁడు!

గ్రంథ విమర్శ

(1) శ్రీ కబీరుచరిత్రము. [పద్యకావ్యము] గ్రంథకర్త శ్రీ దండా నరసింహకవి. ప్రాప్తిస్థానము : శ్రీ దండా నరసింహకవి, చిన్నబజారు బరంపురం, గంజాంజిల్లా వెల రు 2. డెమ్మీసైజు పుటలు. 160.

ఇది మూఁడాశ్వాసముల పద్యకావ్యము. భారతదేశభక్తులలో నగ్రగణ్యుఁడగు కబీరుచరిత్రము చక్కని ధారాశుద్ధిగల కావ్యముగా రచించిన శ్రీకవిగారు స్తవనీయులు. వీరికవిత ప్రశస్తమగు పూర్వపద్ధతిని జాలవఱకు నిర్దుష్టముగా నడచినది. ఆయాతావుల వర్ణనములు మనోహరములై మంజులముగ నడచినవి. పూర్వకవుల ధోరణులను బుణికిపుచ్చుకొని కవిగారీకావ్యమును భక్తిరసప్రధానముగా వివరించి యున్నారు. ఇది భక్తులెల్లరును జదువఁదగినకావ్యము.

(2) శ్రీ వేంకటేశ్వరస్తుతి రత్నమాల కూర్పరి. కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి. ప్రాప్తిస్థానము. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము, తిరుపతి వెల 1-2-0 డెమ్మీసైజు 76 పుటలు.

నృసింహపురాణము, కవికర్ణరసాయనము, కళాపూర్ణోదయము, పరమయోగి విలాసము, చంద్రభాను చరిత్ర మున్నగు ప్రాచీన ప్రసిద్ధ గ్రంథములనుండి శ్రీ వేంకటేశ్వరస్తుతి పద్యరత్నములను కీ. శే. ప్రభాకరశాస్త్రిగారు సేకరించి గతించిరి. అవి యిపుడిట్లు ప్రకటితములు. దీనికిఁ జివర శ్రీ ప్రభాకరశాస్త్రిగారు రచించిన పద్యములును గొన్ని కలవు. శ్రీ వేంకటేశ్వర స్తుతి ప్రియులగు భక్తులెల్లర కివి పారాయణ యోగ్యములు. ఈ సంకలిత గ్రంథమును బ్రకటించిన ప్రాచ్యపరిశోధనాలయమువారు నిరంతరాయముగ నిట్టి యుద్గ్రంథములను బ్రకటించుచుండుట ముదావహము.

(3) తాళ్ళపాకవారి గేయరచనలు. ఆఱవ సంపుటము. ఆధ్యాత్మ సంకీర్తనలు. అన్నమాచార్య రచితములు. ఉదయగిరి శ్రీనివాసాచార్య పరిశోధితము. ప్రాప్తిస్థానము. శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ ఇన్స్టిట్యూట్, తిరుపతి. వెల: రు 2-0-0.

గేయవాఙ్మయ చరిత్రమున శ్రీ తాళ్ళపాకవారి కద్వితీయస్థానము కలదు. ఇదివఱలో అన్నమాచార్యుల శృంగార వైరాగ్య కీర్తనలు ప్రకటించిన ప్రాచ్యపరిశోధనాలయమువారిపుడీ యధ్యాత్మ సంకీర్తనలు వెలయించి ఆంధ్రగేయ సాహిత్యమునకు వెలలేని సేవచేసినారు. గ్రంథము చివర సంకీర్తనలకే కాక రాగములకుగూడ అకార క్రమమున పట్టికల నిచ్చియున్నారు.

(4) Prasnopanishad Bhashya. Edited with Introduction, Notes and translation by Dr. K. C. Varadachari, M. A., PH. D., and D. T. Tatacharya, Siromani, M. O. L. Published by the Venkateswara Oriental Institute, Tirupati. Price: Rs. 2-12-0.

(5) అనుభవ వైద్యము. ఆయుర్వేదాచార్య, ములుగు విశ్వేశ్వరశాస్త్రిగారు సంపాదించినది. గవర్నమెంటు ఓరియంటల్ మ్యానుస్క్రిప్టు లైబ్రరీ, చెన్నపురి వారు ప్రకటించినది. వెల: 6-0-0.

ఇది చక్కని కాగితములపై మనోహరముగ ముద్రితమైన అమోఘమగు వైద్యశాస్త్ర గ్రంథము. దీని సంపాదకులు: 'ఇది చెన్నపురి పరిసరప్రాంతములందు నివసించిన యొక వైద్యవరుని చేతి పుస్తకము (Diary) అని నాకు తోఁచినది' అని వ్రాసిరి. ఏమైనను ఇంచుమించు 1200 యోగములు కలవు. వీని నన్నిటిని అనుభవస్థులగు వారివద్ద గ్రంథకర్త సేకరించినట్లు స్పష్టముగా తోఁచుచున్నది. కొన్నికొన్ని యోగములు తా నెవరివలన విన్నదియు గ్రంథకర్త అట నట నిచ్చియుండుటే యిందులకు సాక్ష్యము. ఈ యుత్కృష్ట గ్రంథము వైద్య శాస్త్రజ్ఞులకు సామాన్యులకుకూడ నుపయుక్తమనుటలో సందేహము లేదు. కాని,

సంపాదకులన్నట్లు ఈ యోగములు ముందు తగు వైద్యులు పరిశోధన చేసియే రోగులకు వాడుట మంచిది. ఇందు గ్రంథకర్త అటనట వాడిన అరవ పదములకు గ్రంథాంతమున తెలుగు పర్యాయ పదములు చూపఁబడినవి. చివర విషయసూచికయు, తప్పొప్పుల పట్టికయుఁ గలవు. ఇట్టి యుత్కృష్ట వైద్యగ్రంథమును బరిశోధింపించి ప్రకటించిన ప్రకాశకులెంతయు నభినందనీయులు.

(6) అభినయదర్పణము. కర్త: లింగముగుంట మాతృభూతయ్య ప్రకాశకులు. గవర్నమెంటు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ, చెన్నపురి. సంపాదకులు సంగీతకళానిధి, శ్రీ టి. వి. సుబ్బారావు, బి.ఏ.,బి.యల్., వెల: రు 1-12-0.

ఇది ప్రాచీన కావ్యరూపమునఁ గల సంగీత లక్షణ గ్రంథము. ఈ గ్రంథమును గూర్చియుఁ గవినిగూర్చియు సంపాదకులు చిన్న పీఠిక వ్రాసియున్నారు. నాట్యశాస్త్రమునకుఁ దలమానిక మగు నీయభినయ శాస్త్రము. 103 పద్యములలోఁ గూర్పబడుట మిగులఁ బ్రశంసనీయము. కవితయు సరసముగను సరళముగను నడచినది. అభినయ సంగీతాభిమానులెల్లరు తప్పక చూడవలసిన గ్రంథ మిది.

(7) శైవాచార సంగ్రహము. తిరుమలనాథ కవికృతము. విద్వాన్ గంటి జోగిసోమయాజిగారు పరిశోధించినది. వెల: రు 2-0-0.

దీనిని బ్రకటించినవారు మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీవారు.

ఇది మూఁడాశ్వాసముల పద్యకావ్యము. వివిధ శైవగ్రంథములందుఁ జెప్పఁబడిన శైవాచారముల నన్నిటిని సంగ్రహించి శైవుల నిత్యకృత్య పూజావిధానమున కనుగుణముగా నుండునట్లీ గ్రంథముఁ వ్రాయబడినది. కవిని గురించియుఁ గాలమును గురించియు ఈ గ్రంథప్రాశస్త్యమును గురించియు శ్రీ సోమయాజిగారు చక్కని పరిశోధనపూర్వకమగు పీఠిక దీనికి వ్రాసియున్నారు. ఇది కేవలము మతదృష్టితో రచింపఁ

బడినదైనను కవిత్వము పేలవముగాలేదు. చెప్పుకోతగ్గ మహాకవిత్వము గాదు. సంసారపక్షముగానున్నది.

(8) శ్రీ మదాంధ్రరామాయణోత్తరకాండ లేక సీతావిజయము. కర్త : దేవళ్ళ కృష్ణారాయ చౌదరి. గ్రంథకర్తయే ప్రకాశకుఁడు, తాటిపాక, రాజోలు తాలూకా. వెల : రు 3-0-0.

ఇది నాలుగాశ్వాసముల చక్కని పద్యకావ్యము. కవిత్వము నిర్దుష్టము. మంజులమును. కుంభకర్ణ రావణాదుల చరిత్రలు, అంబూత్తరుని కథ, సహస్ర శీర్షాస్రవ చరిత్ర. విభీషణ పట్టాభిషేకము మున్నగు నద్భుత గాథలెన్నియో యిందున్నవి. ఎల్లరు చదువఁదగిన మహాగ్రంథము.

(9) ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వము. [సంజ్ఞా సంధి తత్సమాచ్ఛిక పరిచ్ఛేదములు.] మొదటి సంపుటము.
గ్రంథకర్త: కళాప్రపూర్ణ శ్రీ వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారు. ప్రకాశకులు : ఆంధ్ర విశ్వ విద్యాలయము, వాల్తేరు. వెల : రు 25-0-0.

(10) కిన్నెర : మాస పత్రిక. సంపాదకులు : పందిరి మల్లికార్జున రావు, పందిరి మీరాబాయిగారలు. 16 జోన్సు వీధి, మద్రాసు 1. విడి సంచిక వెల : 8 అ.

కాకినాడ - ఆంధ్రసాహిత్యపరిషత్తులో

వెలకు దొరకు గ్రంథములు

1. జైమినీభారతము - వచనము - సముఖము వేంకటకృష్ణప్పనాయకుడు	1-8-0
2. యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనము జె. రామయ్యపంతులుగారు బి.ఎ. బి.ఎల్.	1-0-0
3. జ్యోతిశ్శాస్త్రసారము కపిస్థలం కృష్ణమాచార్యులుగారు	0-8-8
4. జ్ఞానప్రసూనాంబికాశతకము	0-4-0
5. సర్వేశ్వరశతకము - యథావాక్కుల అన్నమయ్య	0-400
6. ఆరాధ్యముద్రితగ్రంథసూచిక	0-8-0
7. ప్రాకృత భాషోత్పత్తి - శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు	0-12-0
8. శివతత్త్వసారము - మల్లికార్జున పండితారాధ్యులు	1-0-0
9. చంద్రభానుచరిత్రము - తరిగొప్పుల మల్లన్నకవి	1-0-0
10. శివరాత్రిమాహాత్మ్యము - శ్రీనాథ మహాకవి	1-0-0
11. ఆర్యభాషావిభాగము - శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు	0-8-0
12. ప్రాస్వరంగములు - కొత్తపల్లి సూర్యారావుగారు	0-8-0
13. మన్నారుదాసవిలాసనాటకము - రంగాజమ్మ	0-12-0
14. కాళిందీకన్యాపరిణయము (ప్రథమభాగము) అహోబలపతి	1-0-0
15. డిటో ద్వితీయభాగము	0-8-0
16. రెడ్లనాటి రెండుశాసనములు	0-8-0

17. ఆంధ్రధాతుమాల	1-0-0
18. శాసనపద్యమంజరి - జయంతి రామయ్య పంతులు బి.ఎ. బి.ఎల్.	1-0-0
19. శాసనపద్యమంజరి (ద్వితీయభాగము)	0-8-0
20. శతకసముచ్చయము (మొదటిభాగము)	1-0-0
21 డిటో (ద్వితీయభాగము)	1-0-0
22. పరిషత్పుస్తకభాండాగారము (ద్వితీయభాగము)	1-0-0
23. సూత్రాంధ్రవ్యాకరణము - చిన్నయసూరి	0-12-0
24. రసాభరణము - అనంతకవి	0-12-0
25. షోడశకుమారచరిత్రము - వెన్నెలకంటి అన్నయ్య	1-0-0
26. హంససందేశము (తెలుగుపద్యములు) కల్లూరి వేంకటరామశాస్త్రిగారు	0-2-0
27. రాయవాచకము - విశ్వనాథనాయని స్థానపతి	1-0-0
28. సింహాసనద్వాత్రింశిక (ప్రథమభాగము) కొఱవి గోపరాజకవి	1-0-0
29. డిటో (ద్వితీయభాగము) ,,	1-0-0
29. నిఘంటుచరిత్రము-శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులు	0-8-0
30. ఆంధ్రకౌముది-గణపవరపు వేంకటకవి	0-12-0
31. బాలభారతము-(అగస్త్యకృతమునకు తెలుగు కొత్తపల్లి సూర్యరావుగారు ...	1-8-0
32. Dravidian Lexicography జయంతి రామయ్యపంతులుగారు బి. ఏ. బి ఎల్. ...	0-8-0
33. Defence of Literary Telugu జయంతి రామయ్యపంతులుగారు ,, ...	0-8-0

34. చాటుధారాచమత్కారసారః-(సంస్కృతము)	...	0-8-0
35. సాంబోపాఖ్యానము-రామరాజు రంగప్పరాజు	...	1-0-0
36. రసార్ణవాలంకారము-ప్రకాశవర్షకవి	...	0-8-0
37 కవిజనోజ్జీవని-సమస్యలు-శ్రీకోట రఘునాథ తొండమాన్ మహీపాలుఁడు	...	0-4-0
38. రఘునాథరామాయణము (ప్రథమభాగము) రఘునాథభూపాలుఁడు	...	0-12-0
39. రజతోత్సవసంపుటము (ఆంధ్రసాహిత్యపరిషత్తు)	...	1-8-0
40. అఱవదేశమునందలి ఆంధ్రవాఙ్మయము అక్కిరాజు ఉమాకాంతముగారు	...	0-4-0
41. లౌకికన్యాయవివరణము- శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు	...	0-12-0
42. ఉత్తరరామచరిత్రము-జయంతి రామయ్యపంతులుగారు బి. ఏ, బి. ఎల్.	...	1-8-0
43. అమరుకము-సాంధ్రము- ,, జయంతి రామయ్యపంతులుగారు	...	1-0-0
44. చంపూరామాయణము-(ఆంధ్రము) జయంతి రామయ్యపంతులుగారు ,,	...	1-0-0
45. ఆధునికాంధ్రవాఙ్మయవికాసవైఖరి జయంతి రామయ్యపంతులుగారు ,,	...	1-8-0
46. ఉన్మాదసహస్రము, (వేయివెఱ్ఱులు) వెఱ్ఱికి వేయివిధములు డా. సూర్యరావుగారు	...	0-12-0

47. నీతిభవనము, ,, ,, ... 0-4-0
48. నమస్కారములు ,, ,, ... 0-4-0
49. సీతారామచరిత్రము-బాలకాండము మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి ... 0-12-0
50. లక్షణసారసంగ్రహము ... 1-0-0
51. కావ్యాలంకారచూడామణి పాఠభేదములు ... 0-8-0
52. పరిషత్పుస్తకభాండాగారము III భాగము ... 1-0-0

—♦ పిఠాపురము మహారాజావారి ప్రచురణములు ♦—

1. ఆంధ్రసూత్రభాష్యము 4 సంపుటములు పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు ... 8-0-0
2. ధర్మఖండము-ఈగులపల్లి భవానీశకవి (రెండుభాగములు) ... 1-8-0
3. విష్ణుమాయానాటకము-చింతలపూడి యెల్లనార్యుడు 1-8-0
4. పరమయోగివిలాసము-(ద్విపద) తాళ్ళపాక తిరువేంగళనాథుడు ... 1-4-0
5. కళాపూర్ణోదయము-పింగళి సూరనార్యుడు శ్రీకాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారిచే బరిష్కరింపబడినది. ... 2-8-0
6 యతిరాజవిజయము-దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి ... 0-10-0
7. రామచంద్రోపాఖ్యానము-వారణాశి వేంకటేశ్వరకవి 1-0-0
8. భద్రాపరిణయము-అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి ... 1-4-0
9. శ్రీపీఠికాపురసంస్థానచరిత్రము-శ్రీరామ వీరబ్రహ్మకవి ... 1-4 0
10. రామరాయవిలాసము-దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి ... 0-12-0
11. మహేంద్రవిజయము- ,, ,, ... 1-0-0
12. Life of Pingali Surana-Tekumalla Achutarao 2-0-0